ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts
సంపుటి - 03 సంచిక -67 పేజీలు - 8 వెల - 03/- శుక్రవారం 26 జూన్ 2026

## నదుల అనుసంధానంతోనే
# దేశాభివృద్ధి



## తుంగభద్రానదికి 33 కొత్తగేట్లు



రూ.51 కోట్లతో 33 కొత్త గేట్ల ఏర్పాటు
మూడు రాష్ట్రాల సిఎంలు కలిసి ప్రారంభం
కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి పాటిల్
ఒకేవేదికపై డికె, చంద్రబాబు, రేవంత్

## జల వివాదాలను పరిష్కరించుకుందాం

పంచాయితీలు కాదు...పరిష్కారాలు ముఖ్యం
తుంగభద్ర గేట్ల ప్రారంభం చరిత్రలో నిలవాలి
మూడు రాష్ట్రాల పరిధిలో సమస్యలకు పరిష్కారం చూపాలి
కేంద్రమంత్రి పాటిల్ దీనిని అవకాశంగా తీసుకోవాలి
మునీరాబాద్ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి



**బళ్లారి,జూన్ 25, (రిపబ్లిక్ న్యూస్):** కర్ణాటకలోని హోస్పేటలో తుంగభద్ర ప్రాజెక్టు కొత్త గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. కేంద్రమంత్రి సీఆర్ పాటిల్, కర్ణాటక సీఎం డీకే శివకుమార్, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొని నూతన గేట్లను ప్రారంభించారు. 2024 ఆగస్టులో వచ్చిన వరద ప్రవాహానికి 19వ గేటు కొట్టుకుపోయింది. దీంతో ఆ ప్రాజెక్టును పరిశీలించిన నిపుణుల కమిటీ సూచనతో రూ.51 కోట్లతో 33 కొత్త గేట్లను అమర్చారు. ఈ కార్యక్రమంలో మూడు రాష్ట్రాల జలవనరుల శాఖ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. మిగతా 2లో...

## నీటిని పొదుపుగా వాడదాం..

మూడు రాష్ట్రాల సీఎంల భేటీ చరిత్రాత్మకం: సీఎం చంద్రబాబు
నదుల అనుసంధానమే దేశాభివృద్ధికి కీలకమన్న చంద్రబాబు
ఎల్ నినో ప్రభావంతో నీటిని పొదుపుగా వాడాలని సూచన
దక్షిణాది రాష్ట్రాల భేటీ చరిత్రలో నిలిచిపోతుందన్న సీఎం



# వెనిజువెలా వణికింది




39 సెకన్ల వ్యవధిలోనే రెండు భారీ భూప్రకంపనలు
నేలమట్టం అయిన భారీ భవనాలు..ఇళ్లు, భవన సముదాయాలు
దాదాపు శతాబ్దకాలం తరవాత అతిపెద్ద భూకంపంగా నమోదు
అత్యవసర పరిస్థితి ప్రకటించిన అధ్యక్షురాలు రోడ్రిగేజ్

**కారకాస్,జూన్ 25, (రిపబ్లిక్ న్యూస్):** వెనిజువెలాలో కేవలం నిమిషం తేడాలో రెండుసార్లు భారీ భూకంపం వణికించింది. బుధవారం స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం ఆరు గంటల సమయంలో వెనిజువెలాలో రెండుసార్లు భూమి కంపించింది. తొలుత రిక్టర్ స్కేల్‌పై తీవ్రత 7.2 కాగా, ఆ తర్వాత 7.5 తీవ్రతతో భూ ప్రకంపనలు నమోదు అయ్యాయి. మిగతా 2లో...

## భారత్‌లో అమెజాన్ రూ.4లక్షల కోట్ల పెట్టుబడి

ప్రధాని మోదీతో అమెజాన్ సీఈఓ భేటీ..
ముంబై, హైదరాబాద్‌లలో డేటా సెంటర్ల పెంపునకు ప్రణాళిక



**జూన్ 25, (రిపబ్లిక్ న్యూస్):** ప్రముఖ ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్, భారత్‌లో తన వ్యాపార కార్యకలాపాలను భారీగా విస్తరించేందుకు సిద్ధమైంది. ప్రధాని నరేంద్ర మోదీతో కంపెనీ సీఈఓ ఆండీ జెస్సీ సమావేశమైన అనంతరం ఈ కీలక ప్రకటన వెలువడింది. 2026 నుంచి 2030 మధ్య కాలంలో దేశంలో ఏకంగా 48 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 4.53 లక్షల కోట్లు) పెట్టుబడి పెట్టనున్నట్లు అమెజాన్ ప్రకటించింది. ఈ పెట్టుబడులతో భారత మార్కెట్‌పై తమకున్న దీర్ఘకాలిక . మిగతా 2లో...

## గతాన్ని మరచి పోండి.. అలాంటి పొరపాట్లు జరగవు



ఇకముందు మిమ్ములను బాగా చూసుకుంటా
వచ్చేది కెసిఆర్ ప్రభుత్వమే అంటూ..
కార్యకర్తలకు కెటిఆర్ భరోసా

**వికారాబాద్,జూన్ 25, (రిపబ్లిక్ న్యూస్):** వచ్చే ఐదేళ్లు మన ప్రభుత్వం వచ్చిన తర్వాత కార్యకర్తల బాగోగులు, ప్రజల సంక్షేమం రెండింటిని బ్యాలెన్స్‌గా నడిపించే బాధ్యత నాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భరోసానిచ్చారు. 2028లో మీ అందరి దయతో కేసీఆర్ ముఖ్యమంత్రి అయితరు.. అయిన తర్వాత నేను బాధ్యత తీసుకుంటా..అన్నారు. మీకు రావాల్సిన పదవులు.. జరుగాల్సిన లాభం. మిగతా 2లో...

## ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల నియంత్రణపై
# నారా లోకేష్ దృష్టి..



ప్రభుత్వ పాఠశాలలకు లక్షకు పైగా కొత్త అడ్మిషన్లు
ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల నియంత్రణపై అధ్యయనానికి ఆదేశం
సెప్టెంబర్ 5 నుంచి ఏఐ ట్యూటర్ విధానం పైలట్ ప్రాజెక్ట్
అమరావతిలో సెంట్రల్ లైబ్రరీ నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన

**అమరావతి,, (రిపబ్లిక్ న్యూస్)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడంతో పాటు, అభ్యసన ఫలితాలపై ఈ విద్యా సంవత్సరం ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లిలోని తన నివాసంలో పాఠశాల విద్యాశాఖపై ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. మిగతా 2లో...

## స్థానిక ఎన్నికల్లో విజయం సాధించాలి

అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి
కార్యకర్తలకు సిఎం చంద్రబాబు దిశానిర్దేశం



**మంత్రాలయం,జూన్ 25, (రిపబ్లిక్ న్యూస్):** మరో మూడు నెలల్లో జరగనున్న స్థానిక ఎన్నికల్లో తెదేపా ఘన విజయం సాధించాలని ఆ పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు శ్రేణులకు పిలుపునిచ్చారు. కర్నూలు జిల్లా మంత్రాలయం మండలం మాధవరంలో తెదేపా శ్రేణులతో ఆయన సమావేశమయ్యారు. కర్ణాటకలోని హోసపేటెలో తుంగభద్ర ప్రాజెక్టు మిగతా 2లో...

## కూటమి పాలనలో డ్వాక్రా మహిళలకు అన్యాయం



డ్వాక్రా సంఘాలకు వడ్డీ రాయితీపై కూటమి ప్రభుత్వం మాట తప్పిందన్న జగన్
వడ్డీ రాయితీ కింద ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని మండిపాటు
2025-26లో రాష్ట్ర పన్ను ఆదాయ వృద్ధి -3.22 శాతంగా నమోదైందని విమర్శ

**అమరావతి,జూన్ 25, (రిపబ్లిక్ న్యూస్)** ఏపీలోని కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధినేత జగన్ మరోసారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. డ్వాక్రా మహిళలకు ఇచ్చిన కీలక హామీలను చంద్రబాబు సర్కార్ పూర్తిగా విస్మరించిందని, వడ్డీ రాయితీ పథకాన్ని నిలిపివేసి మహిళా సంఘాలను నిర్వీర్యం చేస్తోందంటూ ఎక్స్ వేదికగా ఆయన సుదీర్ఘమైన పోస్ట్ పెట్టారు. ఏపీలో పన్ను ఆదాయ వృద్ధి పడిపోయిందని మిగతా 2లో...




## ఎపిలో క్రియేటివ్ ఎకానమీ విప్లవం

జూలై నెలలో మెగా ఫిల్మ్ వర్క్‌షాప్
యువతకు ఆధునిక సినీ సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ
సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి

**అమరావతి,జూన్ 25, (రిపబ్లిక్ న్యూస్):** నవ్యాంధ్రలో సరికొత్త 'క్రియేటివ్ ఎకానమీ విప్లవం'కు శ్రీకారం చుట్టనున్నట్లు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. రాష్ట్రంలోని స్థానిక యువత ప్రతిభను ప్రోత్సాహించడంతో పాటు.. యువతకు ఆధునిక సినీ సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ మిగతా 2లో...

# నదుల అనుసంధానంతోనే దేశాభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

తుంగభద్ర డ్యాం కొత్త స్పీల్ వే గేట్లను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ముఖ్యమంత్రులు గురువారం మధ్యాహ్నం ప్రారంభించారు. రూ.51కోట్లతో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన 33 కొత్త స్పీల్ వే గేట్లను ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి, శివకుమార్ కలసి ప్రారంభిండం విశేషం. ఈ కార్యక్రమానికి కేంద్ర జలశక్తి శాఖా మంత్రి సీఆర్ పాటిల్‌తో పాటు ఆయా రాష్ట్రాల మంత్రులు, అధికారులు, పార్టీల కార్యకర్తలు హాజరయ్యారు. గేట్ల ప్రారంభోత్సవం అనంతరం విజయనగర జిల్లా హోసపేటలో జరిగే భారీ బహిరంగ సభకు కేంద్ర మంత్రి, ముఖ్యమంత్రులు వెళ్లారు. అంతకుముందు మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కొప్పల్ జిల్లా మునీరాబాద్‌లోని ఆడిటోరియంలో భేటీ అయ్యారు. అంతర్రాష్ట్ర జల వివాదాలకు సంబంధించిన కీలక అంశాలపై చర్చించారు. తొలుత చంద్రబాబు, డీకే శివకుమార్ భేటీ అవ్వగా.. సమావేశానికి రేవంత్ రెడ్డి 15 నిమిషాలు ఆలస్యంగా వెళ్లారు. అనంతరం ముగ్గురు సీఎంలు, కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ నీటి సమస్యలపై కీలక చర్చలు జరిపారు. ఆ తర్వాత అక్కడి నుంచి గేట్ల ప్రారంభోత్సవానికి వెళ్లారు.



## జల వివాదాలను పరిష్కరించుకుందాం

**మునీరాబాద్ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి**

తుంగభద్ర నది ఒడ్డున.. బళ్లారి వేదికగా జరిగిన ఈ సమావేశం అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదానికి శాశ్వత పరిష్కారం చూపిస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. తుంగభద్ర ప్రాజెక్టుకు ఏర్పాటు చేసిన 33 నూతన గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు.'తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ ముహూర్తం చరిత్రలో నిలిచిపోతుంది. 3 తరాల సమస్యలను 33 గేట్ల పునరుద్ధరణ పరిష్కరించబోతోంది. బళ్లారి, కర్నూలు, అనంతపురం,
పాలమూరు సమస్యలు తీరుస్తుంది. తక్కువ మాట్లాడటం. అత్యంత వేగంగా పనిచేయడం సీఆర్ పాటిల్ ప్రత్యేకత. అలాంటి వ్యక్తి.. కేంద్ర జల్‌శక్తిశాఖ మంత్రిగా ఉండటంతో ఏపీ, తెలంగాణ, కర్ణాటకలో సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని సంపూర్ణంగా విశ్వసిస్తున్నానని అన్నారు. నీటి సమస్యలు పరిష్కరించకపోవడంతో నీరంతా సముద్రంలో కలుస్తున్నాయి. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్‌లో పాలమూరుకు కేటాయించిన 15 టీఎంసీలలో కేవలం 5 టీఎంసీలు మాత్రమే వాడుకోగలుగుతున్నాం. దాదాపు 10 టీఎంసీల నీరు మా వరకూ రావట్లేదు. రాజోలిబండ సమస్యను సీఆర్ పాటిల్, చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ పనులు చరిత్రలో నిలుస్తాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పాలమూరు వలసల గురించి తనకు అవగాహన ఉందని తెలిపారు. మూడు రాష్ట్రాల కరువు జిల్లాలకు ఇది పరిష్కారం చూపబోతోందని పేర్కొన్నారు. గురువారం తుంగభద్ర డ్యాం కొత్త స్పీల్ వే గేట్లు ప్రారంభించాక, కర్ణాటక కొప్పల్ జిల్లా మునీరాబాద్ బహిరంగ సభలో సీఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు, డీకే శివకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. కర్నూలు, అనంతపురం రైతుల సమస్యలు తనకు తెలుసు అని చెప్పుకొచ్చారు. మనందరి కష్టాలు, సమస్యలు తెలిసిన నాయకుడు చంద్రబాబు అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశంసించారు. మూడు రాష్ట్రాల మధ్య నీటి సమస్య పరిష్కారానికి అడుగులు పడుతున్నాయని తెలిపారు. నీటి సమస్యలు పరిష్కరించుకోకపోవడంతో నీరు సముద్రం పాలవుతోందని చెప్పారు. మూడు రాష్ట్రాల మధ్య నీటి చర్చలు ఓ కొలిక్కి వచ్చాయని అన్నారు. తుంగభద్ర నుంచి 10 టీఎంసీల నీరు తమకు రావడం లేదని చెప్పారు. ద రైతులకు న్యాయం జరగాలని తాము ఆశిస్తున్నామని అన్నారు. చరిత్రలో ఈరోజు సువర్ణ అక్షరాలతో నిలిచిపోతుందని తెలిపారు. తమకు పంచాయితీలు వద్దని.. పరిష్కారం కావాలని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాయలసీమ, తెలంగాణలోని లక్షలాదిమంది రైతుల సమస్యకు తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ పరిష్కారమని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. నీటి సమస్యను పరిష్కరించక పోవడంతోనే పాలమూరు వాసులు వలసలు వెళ్లాల్సి వస్తోందని అన్నారు. నీటి సమస్యలు ఓ కొలిక్కి వచ్చాయని.. తెలంగాణకు రావాల్సిన నీటి వాటాపై కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో చర్చించామని తెలిపారు. తుంగభద్రలో పూడికతీతకు సంబంధించిన వ్యవహారంపై కేంద్రమంత్రితో చర్చించామని అన్నారు. తుంగభద్ర నది ఒడ్డున జరిగిన చర్చలు అంతరాష్ట్ర జల వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపుతాయని తెలిపారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక నీటి సమస్యను సీఆర్ పాటిల్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పుకొచ్చారు. ఆయన ఈ సమస్యకు పరిష్కారం చూపిస్తారనే నమ్మకం తమకు ఉందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## నీటిని పొదుపుగా వాడదాం..

**నదుల అనుసంధానమే దేశాభివృద్ధికి కీలకమన్న చంద్రబాబు**

కర్ణాటకలోని హోసపేటలో ఉన్న తుంగభద్ర ప్రాజెక్టుకు 33 నూతన క్రస్ట్ గేట్లను ప్రారంభించడం చారిత్రాత్మక ఘట్టమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభివర్ణించారు. ఈ కార్యక్రమం అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ, కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ చొరవతో ఏపీ, కర్ణాటక, తెలంగాణ ముఖ్యమంత్రులు ఒకేచోట కలవడం చారిత్రాత్మకమని అన్నారు. కేంద్రమంత్రి తన చొరవతో మూడు రాష్ట్రాల ప్రభుత్వాధినేతలనే కాకుండా, నదులను కూడా అనుసంధానించారని ఆయన వ్యాఖ్యానించారు.

మూడు రాష్ట్రాల రైతులకు సాగునీటిని, ఈ ప్రాంత వాసులకు తాగునీటిని అందిస్తోన్న తుంగభద్ర డ్యామ్ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని చంద్రబాబు గుర్తుచేశారు. 'తుంగా పానం, గంగా స్నానం' అనే సామెతను ప్రస్తావిస్తూ, తుంగ నది నీటి పవిత్రతను కొనియాడారు. 2024లో 19వ నంబర్ గేటు కొట్టుకుపోయినప్పుడు, నిపుణుడు కన్నయ్య నాయుడు సలహాతో స్టాప్‌లాక్ గేట్ అమర్చి నీటి వృధాను అరికట్టామని తెలిపారు. ఇప్పుడు ఏపీ, కర్ణాటక ప్రభుత్వాలు సమష్టిగా పనిచేసి 33 కొత్త గేట్లను ఏర్పాటు చేసి, డ్యామ్‌ను పునరుద్ధరించి రైతుల ప్రయోజనాలను కాపాడామని వివరించారు.

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో 'వన్ నేషన్ వన్ గ్రిడ్', టెలికాం, రహదారుల నెట్‌వర్క్ వంటి కార్యక్రమాలతో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోందని చంద్రబాబు అన్నారు. ఇదే స్ఫూర్తితో దేశంలో గంగా-కావేరి నదుల్ని అనుసంధానిస్తే భారతదేశం అప్రతిహతంగా ముందుకు సాగుతుందని ఆయన ఆకాంక్షించారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లో కెన్-బెత్వా ప్రాజెక్టు ద్వారా నదుల అనుసంధానం విజయవంతమైందని గుర్తుచేశారు. అదేవిధంగా గోదావరి-కావేరి నదులను అనుసంధానించడం ద్వారా కర్ణాటక, ఏపీ, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల ప్రయోజనాలు నెరవేరతాయని సూచించారు.

ఈ ఏడాది ఎల్ నినో కారణంగా తుంగభద్ర, ఆల్మట్టి జలాశయాలకు ఎగువ నుంచి నీటి ప్రవాహాలు తగ్గిపోయాయని, అందుకే నీటిని చాలా పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉందని చంద్రబాబు హెచ్చరించారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితులను అధిగమించేందుకే నదుల అనుసంధానం కీలకమని ఆయన పునరుద్ఘాటించారు. ముందుగా రాష్ట్రాల పరిధిలో అంతర్గతంగా నదులను అనుసంధానించుకుని, ఆ తర్వాత అంతర్రాష్ట్ర నదుల అనుసంధానంపై దృష్టి పెట్టాలని సూచించారు.విజయనగర సామ్రాజ్యానికి, హంపీకి తుంగభద్ర నది సహజ రక్షణ కవచంగా నిలిచిందని, జోగులాంబ, హంపీ విరుపాక్ష ఆలయం, రాఘవేంద్ర మఠం వంటి ఎన్నో పుణ్యక్షేత్రాలు ఈ నదీ తీరానే వెలిశాయని చంద్రబాబు గుర్తుచేశారు. 'రాష్ట్రాలుగా మనం వేరైనా, దేశంగా మనం అంతా ఒక్కటే' అని పేర్కొంటూ, కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కలిసి రైతుల ప్రయోజనాలపై చర్చించడం శుభపరిణామమని అన్నారు. ఈ సమావేశం దక్షిణాది రాష్ట్రాల చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందని, అందరం కలిసికట్టుగా రైతుల ప్రయోజనాలను కాపాడుకుందామని ఆయన పిలుపునిచ్చారు.

# వెనిజువెలా వణికింది

(మొదటి పేజీ తరువాయి)

ఆ భూకంపాల ధాటికి భారీ బిల్డింగ్‌లు నేలమట్టం అయ్యాయి. లా గౌరియా ప్రాంతం తీవ్రంగా ప్రభావానినికి గురైంది. అయితే ఆ భూకంపాల వల్ల 32 మంది మృతిచెందగా, 700 మంది గాయపడినట్లు ఆ దేశ తాత్కాలిక అధ్యక్షురాలు రోడ్రిగేజ్ తెలిపారు. డజన్ల సంఖ్యలో బిల్డింగ్‌లు కూలాయని, వీలైనంత వరకు అందర్నీ రక్షిస్తున్నామని, రెస్క్యూ ఆపరేషన్ చేపట్టామని, లా గౌరియా రాష్ట్రంలో పరిస్థితి భయానకంగా ఉందని అధ్యక్షురాలు రోడ్రిగేజ్ తెలిపారు. దేశ రాజధాని కారకాస్‌కు పశ్చిమ దిశలో 168 కిలోమీటర్ల దూరంలో ఉన్న కరీబియన్ తీరంలోని మోరన్ ప్రాంతంలో భూకంప కేంద్రం ఉన్నట్లు అమెరికా జియోలాజికల్ సర్వే ప్రకటించింది. సుమారు 22 కిలోమీటర్ల లోతులో భూమి కంపించినట్లు పేర్కొన్నారు. దాదాపు శతాబ్ద కాలం తర్వాత వెనిజువెలాలో భారీ భూకంపం సంభవించింది.

మృతుల సంఖ్య లక్ష వరకు చేరుకునే అవకాశాలు ఉన్నట్లు యూఎస్ జియోలాజికల్ సర్వే పేర్కొన్నది. వెనెజువెలాను బుధవారం నాడు వరుస భూకంపాలు 39 సెకన్ల వ్యవధిలోనే రెండు భారీ భూకంపాలు సంభవించి తీవ్ర విధ్వంసాన్ని సృష్టించాయి. కరేబియన్ తీరంలోని మోరోన్ పట్టణానికి పశ్చిమాన 21 కిలోమీటర్ల దూరంలో 7.2 తీవ్రతతో మొదటి భూకంపం వచ్చింది. అదే పట్టణానికి సుమారు 45 కిలోమీటర్ల దూరంలో క్షణాల వ్యవధిలోనే 7.5 తీవ్రతతో మరో భూకంపం సంభవించింది. ఈ ఘటనలో 10 వేల నుంచి లక్ష మంది వరకూ ప్రాణాలు కోల్పోయి ఉండొచ్చని యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే అంచనా వేసింది. అలాగే వేల మంది ప్రజలు గాయపడి ఉండొచ్చని తెలిపింది. భూకంపాలతో అనేక భవనాలు నేలమట్టం కాగా, ప్రజలు భయంతో పరుగులు తీస్తున్న అనేక వీడియోలు నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. మొదటి భూకంపం వచ్చినప్పుడు ఒక్కసారిగా పెద్దపెద్ద భవనాలు కూలిపోవడం ప్రారంభమయ్యాయి. అనేక చిన్నచిన్న ఇళ్లు నేలమట్టం అయ్యాయి. ఏం జరుగుతుందో గ్రహించి, ప్రాణరక్షణ కోసం ప్రజలు పరిగెత్తే లోపే అంతకంటే ఎక్కువ తీవ్రతతో రెండో భూకంపం వచ్చింది. దీంతో భారీ విధ్వంసం జరిగింది. కొన్ని భారీ భవనాలు కూలిపోగా, మరికొన్ని బిల్డింగులు ఊగిపోయాయి. కొన్ని ఇళ్ల పైకప్పులు కూలిపోగా, శిథిలాల కింద అనేక మంది చిక్కుకుపోయారు. దీంతో తమ ప్రాణాలను, కుటుంబ సభ్యులను కాపాడు కునేందుకు స్థానికులు తీవ్ర ప్రయత్నాలు చేశారు. మరోవైపు వెనెజువెలాలోని సైమన్ బొలివర్ అంతర్జాతీయ విమానాశ్రయం పైకప్పు కూలిపోయింది. దీంతో విమానాశ్రయంలోని టెర్మినల్ మొత్తం దుమ్ముతో నిండిపోయింది. కొంతమంది ప్రయాణికులు తమ లగేజీ పట్టుకుని ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. మరికొంతమంది లోపలే ఓ ఫుడ్ కౌంటర్ వద్ద ఆశ్రయం పొందారు. మొత్తం దుమ్ముతో నిండిపోతున్నా ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని అక్కడే ఉండిపోయారు. తీరప్రాంత నగరమైన లా గువైరాకు సంబంధించిన మరో వీడియో వెలుగులోకి వచ్చింది. వరుస భూకంపాలతో కూలిపోయిన భవనాలు, గాలిలోని దుమ్ము, నిర్మానుష్యంగా మారిన రహదారులు ఆ వీడియోలో కనిపించాయి.వెనెజువెలా రాజధాని కారకాస్‌లోనూ భారీ విధ్వంసం జరిగింది. అనేక భవనాలు నేలమట్టం అయ్యాయి. స్థానికులు ప్రాణభయంతో కేకలు వేసిన దృశ్యాలు ఆవేదన కలిగిస్తున్నాయి. మరో వీడియోలో ఓ వ్యక్తి తన పెంపుడు కుక్కల ప్రాణాలు కాపాడిన దృశ్యాలు కనిపించాయి. కూలిపోయిన తమ ఇంటి నుంచి అతి కష్టం మీద కుటుంబ సభ్యులను కాపాడుకున్నాడు బాధితుడు. ఆ తర్వాత తన రెండు కుక్కలనూ ప్రాణాలతో బయటకు తీసుకువచ్చాడు.ఇలాంటి అనేక వీడియోలు ప్రపంచవ్యాప్తంగా ప్రజలను కంటతడి పెట్టిస్తున్నాయి. మరోవైపు జంట భూకంపాల అనంతరం వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. బాధితులను ఆదుకునేందుకు సహాయక చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. వెనెజువెలా ప్రతిపక్ష నాయకురాలు మరియా కొరినా మచాడో కూడా ప్రజలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## ఎపిలో క్రియేటివ్ ఎకానమీ విప్లవం

(మొదటి పేజీ తరువాయి)

రూపొందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. జూలై నెలలో మెగా ఫిల్మ్ వర్క్‌షాప్ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని మంత్రి చెప్పారు. గురువారం సచివాలయంలో మంత్రిని జాడెక్స్ ఇన్నోవిజన్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు కలిసి పలు అంశాలపై చర్చించారు. సినీ పరిశ్రమకు సంబంధించిన 24 క్రాఫ్ట్స్‌పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఏఐ ఆధారిత ఫిల్మ్ మేకింగ్ నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. 24 క్రాఫ్ట్స్ శిక్షణకు సంబంధించి జాడెక్స్ సంస్థ రూపొందించిన యాక్షన్ ప్లాన్‌పై సమావేశంలో సమగ్రంగా చర్చించినట్లు మంత్రి తెలిపారు. యువతకు ప్రపంచ స్థాయి ఫిల్మ్ మేకింగ్‌పై అవగాహన కల్పిస్తామన్నారు. సినీ, మీడియా రంగాల్లో కొత్త ఉపాధి అవకాశాలు సృష్టించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రంలో క్రియేటివ్ ఎకానమీ బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను రూపొందించనున్నట్లు మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.

## గతాన్ని మరచి పోండి..అలాంటి పొరపాట్లు జరగవు

(మొదటి పేజీ తరువాయి)

మీకు కోరుకునే గౌరవం వచ్చే విధంగా చేసే బాధ్యత నాది. గతం మరిచిపోండి.. చిన్నచిన్నపొరపాట్లు జరిగి ఉండొచ్చు. ఇక్కడ ఉద్యమంలో పనిచేసిన బిడ్డలు కూడా ఉన్నారు. వాళ్లకు కూడా అయ్యో మాకు జరుగాల్సిన న్యాయం జరుగలేదనే భావన ఉండొచ్చు. నేను వారందని ప్రార్థిస్తున్నానని అన్నారు. చేవెళ్ల నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం, ఎస్ఐఆర్ శిక్షణా కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ.. గతంలో లాగా చిన్నచిన్న పొరపాట్లు జరుగకుండా చూసుకుంటమని నేను మీకు మాటిస్తున్నానన్నారు. వాస్తవానికి మొత్తం ప్రభుత్వం మీద దృష్టి పెట్టినం.. పార్టీ మీద ఎక్కువ దృష్టి పెట్టలేదు. కొత్త రాష్ట్రం, కొత్త సంసారం కాబట్టి పునాది గట్టిగా పడాలి అని.. మన రాష్ట్రం నవ్వే వాళ్ళ ముందు జారిపడొద్దని.. మీకు పరిపాలన చేతనైతదా అన్నోళ్లను నోళ్లు మూయించాలే.. మంచిగా నడిపించాలని ఆలోచన చేసాం తప్ప వేరే ఆలోచన చేయలేదని అన్నారు. ఒక సైనికుడు శాంతి సమయంలో ఎంత చెమట చిందిస్తే, యుద్ధంలో అంత తక్కువ రక్తం కారుతుంది. మీ ఈ టైంలో పార్టీని బందబస్తుగా నిర్మాణం చేసుకుంటే రేపు ఎన్నికలు వచ్చినంక ఆగమాగమయ్యే బాధ తప్పుతది.. మీకు ఐడీ కార్డు వస్తది.. ఆ ఐడీ కార్డు రేపు మన ప్రభుత్వం వచ్చినంక జేబులో పెట్టుకొని పోతే ఆ ఆఫీసర్ అయినా పోలీసోడు అయినా కేసీఆర్ మనిషి వచ్చిండు పని చేయాలని మీకు గౌరవమిచ్చి పనిచేసే పరిస్థితి ఉంటది. మంచి ఐడీ కార్డు తయారుచేసి ప్రతీ కార్యకర్తకు ఇస్తం. మిమ్మల్ని రాబోయే 5 సంవత్సరాలు మాత్రం గతంలో జరిగిన పొరపాట్లు మళ్లీ జరుగకుండా ఉద్యమ కారులను కానీ, కార్యకర్తలను కానీ కడుపులో పెట్టుకొని చూసుకునే బాధ్యత తీసుకుంటానన్నారు.

# కూటమి పాలనలో డ్వాక్రా మహిళలకు అన్యాయం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రం ఆర్థిక మాంద్యం వైపు వెళ్తోందంటూ ఆందోళన వ్యక్తం చేశారు.ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం డ్వాక్రా సంఘాల రుణాలపై వడ్డీ రాయితీ పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతామని సూపర్ సిక్స్ తరహాలో హామీ ఇచ్చిందని జగన్ అన్నారు. కానీ అధికారంలోకి వచ్చాక ఆ మాట తప్పారని మండిపడ్డారు. తమ వైసీపీ ప్రభుత్వ హయాంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.4,969 కోట్ల మేర వడ్డీ రాయితీతో పాటు ఆసరా, చేయూత వంటి స్కీమ్స్‌తో ఆర్థిక భరోసా ఇచ్చామని తెలిపారు.కూటమి ప్రభుత్వం వచ్చాక 2024-25 ఆర్థిక సంవత్సరంలో వడ్డీ రాయితీ కింద ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని జగన్ ఆరోపించారు. 2025-26 బడ్జెట్‌లో రూ.100 కోట్లు, మళ్లీ ఇప్పుడు 2026-27 బడ్జెట్‌లోనూ రూ.100 కోట్లు కేటాయించినప్పటికీ.. ఆ నిధులు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని, గ్రౌండ్ లెవెల్లో ఒక్క పైసా కూడా విడుదల కాలేదన్నారు. ఈ వడ్డీ రాయితీ అమలు చేయకపోవడం వల్ల గత రెండేళ్లలో డ్వాక్రా మహిళలకు సుమారు రూ.6 వేల కోట్ల మేర నష్టం జరిగిందని విమర్శించారు. 2023-24లో రూ.49,696 కోట్లుగా ఉన్న డ్వాక్రా రుణ వృద్ధి.. కూటమి పాలనలో 2024-25 నాటికి రూ.41,623 కోట్లకు, 2025-26లో మరింత తగ్గి రూ.41,105 కోట్లకు పడిపోయిందని అన్నారు. అంతేకాదు, 2025-26లో రాష్ట్ర పన్ను ఆదాయ వృద్ధి -3.22 శాతంగా నమోదైందని... ఇది ఏపీలో స్పష్టమైన ఆర్థిక మాంద్యానికి సంకేతమని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న మహిళా సంఘాలను నిర్లక్ష్యం చేస్తే రాష్ట్రం మరింత సంక్షోభంలో పడుతుందని హెచ్చరిస్తూ, బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## భారత్‌లో అమెజాన్ రూ.4లక్షల కోట్ల పెట్టుబడి

(మొదటి పేజీ తరువాయి)

నిబద్ధతను కంపెనీ మరోసారి స్పష్టం చేసింది.

భారత్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను విస్తరించడానికి 2030 నాటికి అదనంగా 13 బిలియన్ డాలర్లు పెట్టుబడిగా పెట్టనున్నట్లు ఆండీ జెస్సీ తెలిపారు. దీంతో కేవలం ఏఐ, క్లౌడ్ రంగంలోనే అమెజాన్ మొత్తం పెట్టుబడి 21 బిలియన్ డాలర్లను దాటనుంది. ఈ పెట్టుబడుల ద్వారా ముంబై, హైదరాబాద్‌లలోని అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) డేటా సెంటర్ల సామర్థ్యాన్ని గణనీయంగా పెంచనున్నారు. ఇది స్టార్టప్‌లు, వ్యాపార సంస్థలు, ప్రభుత్వ ఏజెన్సీలకు కస్టమ్ ఏఐ చిప్స్, సురక్షిత క్లౌడ్ టెక్నాలజీలు, డెవలపర్ టూల్స్‌ను అందుబాటులోకి తెస్తుంది. తద్వారా ఆవిష్కరణలను వేగవంతం చేయవచ్చని కంపెనీ పేర్కొంది.ఈ సమావేశం అనంతరం ఆండీ జెస్సీ మాట్లాడుతూ.. "దశాబ్దం క్రితం భారత్‌లోకి అడుగుపెట్టాం. అప్పటి నుంచి ఈ-కామర్స్, ఏఐ, క్లౌడ్ వ్యాపారాల్లో అద్భుతమైన వృద్ధిని చూస్తున్నాం. ప్రధాని మోదీ దార్శనికత అయిన 'వికసిత్ భారత్', 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యాల సాధనకు కట్టుబడి ఉన్నాం. భారత్ వృద్ధి ప్రస్థానంలో దీర్ఘకాలిక భాగస్వామిగా కొనసాగుతాం" అని స్పష్టం చేశారు. ఈ కొత్త పెట్టుబడులతో కలిపి 2010 నుంచి 2030 వరకు భారత్‌లో అమెజాన్ పెట్టిన మొత్తం పెట్టుబడుల విలువ 88 బిలియన్ డాలర్లకు పైగా చేరుకుంటుంది.

గత కొన్నేళ్లుగా భారత్‌లో 12 మిలియన్ల చిన్న వ్యాపారాలను డిజిటలైజ్ చేశామని, 20 బిలియన్ డాలర్ల విలువైన ఈ-కామర్స్ ఎగుమతులను సాధ్యం చేశామని, ప్రత్యక్షంగా, పరోక్షంగా 2.8 మిలియన్ల ఉద్యోగాలకు మద్దతు ఇచ్చామని కంపెనీ వివరించింది. అలాగే, 10 మిలియన్ల భారతీయులకు క్లౌడ్ స్కిల్స్‌పై శిక్షణ ఇచ్చినట్లు తెలిపింది. భవిష్యత్తులోనూ భారత ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా ఏఐ ఆధారిత డిజిటలైజేషన్, ఎగుమతుల వృద్ధి, ఉద్యోగాల కల్పనపై దృష్టి సారిస్తామని అమెజాన్ పేర్కొంది. రానున్న కాలంలో 3.8 మిలియన్ల ఉద్యోగాలకు మద్దతు ఇవ్వడం, 80 బిలియన్ డాలర్ల సంచిత ఎగుమతులు సాధించడం, 15 మిలియన్ల చిన్న వ్యాపారాలకు ఏఐ ప్రయోజనాలు అందించడం, 4 మిలియన్ల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏఐ విద్యను అందించడం వంటి లక్ష్యాలను నిర్దేశించుకున్నట్లు వెల్లడించింది.

,

## స్థానిక ఎన్నికల్లో విజయం సాధించాలి

(మొదటి పేజీ తరువాయి)

కొత్త గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన అనంతరం సీఎం మాధవరం చేరుకున్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలతో ఆయన మాట్లాడుతూ పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు, మంత్రాలయం తెదేపా ఇన్‌ఛార్జ్ రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మన ప్రభుత్వం చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించాలి. తెదేపా నాయకులు నిరంతరం ప్రజల్లో ఉండాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచిన వారిని అక్కున చేర్చుకుంటా. ఓడిపోయిన వారిని పక్కన పెట్టేస్తా. కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి. మంత్రాలయం వైకాపా ఎమ్మెల్యే చిచ్చు పెడుతున్నారు.. ఆయనకు బుద్ధి చెబుతాం. 2029 ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకి రావడం ఖాయం. అధికారం ఉంది కదా అని నేతలు ప్రజలకు అందుబాటులో లేకపోతే వారికి దూరమవుతారు. మంత్రాలయం తెదేపాలో అసమ్మతి, విభేదాలు లేకుండా అందరూ ఒక్కతాటిపైకి వచ్చి గెలుపుకోసం పని చేయాలని చంద్రబాబు సూచించారు.

## ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల నియంత్రణపై నారా లోకేష్ దృష్టి..

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా శాఖకు సంబంధించిన పలు కీలక వివరాలను అధికారులు మంత్రికి వివరించారు.

ప్రస్తుత విద్యా సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు సుమారు 1,06,000 మంది విద్యార్థులు కొత్తగా ప్రవేశాలు పొందారని అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలోని మొత్తం 7,620 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 3,515 పాఠశాలలు (46.13 శాతం) ప్రస్తుతం పూర్తి సామర్థ్యంతో నడుస్తున్నాయని వారు వివరించారు. విద్యా రంగంలో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల వల్లే ఈ సానుకూల మార్పు చోటుచేసుకుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ సమావేశంలో ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజుల నియంత్రణ అంశంపై కూడా ప్రధానంగా చర్చించారు. ఫీజుల నియంత్రణకు సంబంధించి ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, నివేదిక సమర్పించాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. మరోవైపు, సెప్టెంబర్ 5 నుంచి మొదటి విడత కింద 175 'లీప్' పాఠశాలల్లో 9, 10 తరగతుల విద్యార్థుల కోసం 'ఏఐ ట్యూటర్' విధానాన్ని పైలట్ ప్రాజెక్టుగా చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. భవిష్యత్తులో ఈ విధానాన్ని 'క్లిక్కర్స్'కు అనుసంధానించాలని మంత్రి అధికారులకు సూచించారు.అమరావతిలో స్టేట్ సెంట్రల్ లైబ్రరీ, విశాఖపట్నంలో డిస్ట్రిక్ట్ సెంట్రల్ లైబ్రరీ, మంగళగిరిలో స్కిల్ ఎక్సలెన్స్ సెంటర్ ఏర్పాటుపై కూడా ఈ సమావేశంలో చర్చించారు. వచ్చే నెలలో అమరావతిలో సెంట్రల్ లైబ్రరీ నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు వివరించారు. ఈ సమీక్షా సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి శ్యామలరావు, పాఠశాల విద్య డైరెక్టర్ తమీమ్ అన్సారియా తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# జూన్ 28న పల్స్ పోలియో మహా కార్యక్రమం

5 ఏళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరి
నగరంలో 229 బూత్‌ల ద్వారా 82,964 మంది చిన్నారులకు వ్యాక్సిన్ లక్ష్యం
చుక్కలు వేయించుకోలేని చిన్నారులకు జూన్ 29, 30న ఇంటింటికీ సేవలు
పిల్లల ఆరోగ్య రక్షణకు తల్లిదండ్రులు సహకరించాలి: ఎంహెచ్ఓ డాక్టర్ ఎం. రఘు




**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 25)**ఈ నెల 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నగరపాలక ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు పిలుపునిచ్చారు. పోలియో మహమ్మారి నుంచి చిన్నారులను రక్షించేందుకు పుట్టిన శిశువు నుంచి ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించడం అత్యంత అవసరమని తెలిపారు.నగరంలోని 229 పోలియో బూత్‌ల పరిధిలో 82,964 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. జూన్ 28న బూత్‌లలో చుక్కలు వేయించుకోలేని చిన్నారులను జూన్ 29, 30 తేదీల్లో ప్రత్యేక బృందాలు ఇంటింటికీ వెళ్లి గుర్తించి వ్యాక్సిన్ అందజేస్తాయని తెలిపారు.ప్రయాణాల్లో ఉన్న చిన్నారులు, బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ఇటుక బట్టీలు, సంచార జాతుల నివాస ప్రాంతాలు, రోడ్డు నిర్మాణ ప్రాంతాలు, క్వారీల వద్ద ఉన్న పిల్లలను కూడా గుర్తించి పోలియో చుక్కలు వేయాలని అధికారులకు సూచించారు.
"ఒక్క చిన్నారిని కూడా వదలకుండా పోలియో చుక్కలు వేయించి వారి నిండు జీవితాన్ని కాపాడుదాం" అని డాక్టర్ ఎం. రఘు పిలుపునిచ్చారు.

## రైతులు, కౌలురైతుల సమస్యల పరిష్కారానికి ఈనెల 30వ తారీఖున చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

ఏపీ రైతు సంఘం భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ



**ఓర్వకల్లు ప్రతినిధి, జూన్ 25 (రిపబ్లిక్ న్యూస్)**
గురువారం రోజు ఏపీ రైతు సంఘం భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే. జగన్నాథం అదేవిధంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప మాట్లాడుతూ రైతులు కౌలు రైతుల సమస్యల పరిష్కారానికి చలో విజయవాడ కార్యక్రమాన్ని ఈ నెల 30వ తారీఖున జయప్రదం చేయాలని అదేవిధంగా గత రెండేళ్లుగా మన రాష్ట్రంలో రైతాంగం తీవ్ర సంక్షోభం లో కొట్టుమిట్టాడుతుంది అదేవిధంగా పంటలకు కనీస మద్దతు ధర దక్కడం లేదు. ఇటీవల పెరిగిన ఎరువులు పురుగుమందులు, విత్తనాలు పెట్రోల్, డీజిల్ వ్యవసాయ యంత్ర పరికరాల ధరలు తగ్గించాలి. అదేవిధంగా పెరిగిన సాగు ఖర్చులకు అనుగుణంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి పంటలు రుణాలు ఇవ్వాలి.. అదేవిధంగా ఎన్నికల హామీ ప్రకారం కూటమి ప్రభుత్వం కౌలు రైతులకు సులభంగా గుర్తింపు కార్డులు జారీ చేయాలి. అదేవిధంగా 50 సంవత్సరాలు పైబడిన ప్రతి రైతుకు పదివేల రూపాయలు పింఛన్ ఇవ్వాలి. అదేవిధంగా గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని వారు అన్నారు. తధానంతరం చలో విజయవాడ కరపత్రాన్ని విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు సుధాకర్, ఈదురు, సిపిఐ మండల కార్యదర్శి రమేష్, కల్లూరు రైతు సంఘం మండల కార్యదర్శి రాముడు, కొంతలపాడు సిపిఐ నాయకులు పి.చంద్ర తదితరులు పాల్గొన్నారు

## పీర్ల పండుగను శాంతియుతంగా జరుపుకోండి

చిప్పగిరిఎస్సై సి.వెంకట నరసింహులు




**చిప్పగిరి, జూన్, 25,( రిపబ్లిక్ న్యూస్)** పీర్ల పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని చిప్పగిరి ఎస్సై సి.వెంకట నరసింహులు తెలిపారు, గురువారం గుమ్మనూరు, కాజీపురం, బంటన హాల్, గ్రామాలను సందర్శించి గ్రామస్తులతో సంభాషించి ఎటువంటి ఆహ్వానించనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని ప్రజలను కోరారు ,ఈ కార్యక్రమంలో గ్రామాల ప్రజలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## యువజన కాంగ్రెస్ ఎన్నికల ఫలితాలు విడుదల..

నంద్యాల జిల్లా అధ్యక్షులు గాశకునాల శ్రీనివాస్ యాదవ్ ఎన్నిక
ప్రధాన కార్యదర్శిగా రామాపురం శ్రీధర్ గౌడ్ఎన్నిక




**ఓర్వకల్లు ప్రతినిధి, జూన్ 25(రిపబ్లిక్ న్యూస్)**
భారతీయ యువజన కాంగ్రెస్ ఆంధ్రప్రదేశ్ సంస్థాగత ఎన్నికల ఫలితాలను ఎన్నికల అథారిటీ అధికారికంగా విడుదల చేసింది. ఈ ఎన్నికల్లో నంద్యాల జిల్లా పాణ్యం కి చెందిన శకునాల శ్రీనివాస్ యాదవ్ విజయం సాధించారు.యువజన కాంగ్రెస్ ఎన్నికల షెడ్యూల్ ప్రకారం నామినేషన్ల ప్రక్రియ జనవరి 7న ప్రారంభమై జనవరి 29 వరకు కొనసాగింది. అనంతరం సభ్యత్వ నమోదు, ధృవీకరణ, సభ్యత్వ రుసుము చెల్లింపు కార్యక్రమాలు ఏప్రిల్ 20 నుంచి మే 11 వరకు నిర్వహించారు. జూన్ 12 నుంచి 15 వరకు సభ్యుల అర్హతలు, ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అంశాలపై స్క్రూటినీ నిర్వహించి, ఎన్నికల ప్రక్రియ పూర్తయిన అనంతరం ఫలితాలను ప్రకటించారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన శ్రీనివాస్ మాట్లాడుతూ తమపై విశ్వాసం ఉంచి గెలిపించిన యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి నాగ మధు యాదవ్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు. మరియు కార్యకర్తలకు , నాయకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. యువజన కాంగ్రెస్ సంస్థను గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు మరింత బలోపేతం చేయడంతో పాటు యువత సమస్యల పరిష్కారం, విద్య, ఉపాధి అవకాశాల కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు.వారి ఎన్నిక పట్ల కాంగ్రెస్ పార్టీ, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. యువజన కాంగ్రెస్ సంస్థ అభివృద్ధికి వారు కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.

# ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన సదస్సు

నెల్లిబండ, కుంకనూరు రైతులకు శిక్షణ ప్రకృతి వ్యవసాయంతో ఖర్చులు తగ్గించి దిగుబడులు పెంచుకోవాలనిసూచన:-వ్యవసాయ అధికారి బి. ఉషారాణి

**దేవనకొండ, జూన్ 25( ప్రజా రిపబ్లిక్ న్యూస్ ):-**
దేవనకొండ మండలంలోని నెల్లిబండ, కుంకనూరు గ్రామాల రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు మరియు వాతావరణ మార్పులకు అనుగుణమైన సాగు విధానాలపై గురువారం అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి బి. ఉషారాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీఆర్‌సీ ఏడీఏలు అన్నపూర్ణ, అరుణ కుమారి రైతులకు వివిధ ప్రకృతి వ్యవసాయ సాంకేతికతలను వివరించారు.




శిక్షణలో భాగంగా ప్రకృతి వ్యవసాయంలో వినియోగించే నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, అగ్నాస్త్రం తయారీ విధానం, వినియోగ పద్ధతులు, వాటి ప్రయోజనాలపై సమగ్ర అవగాహన కల్పించారు. రసపీల్చే పురుగులు, కాయతొలిచే పురుగులు, కాండం తొలిచే పురుగుల నివారణకు కాషాయాలు సమర్థవంతంగా పనిచేస్తాయని తెలిపారు.అదేవిధంగా జీవామృతాలు, సహజ ఎరువుల వినియోగం, నేల ఆరోగ్య పరిరక్షణ, పంటల దిగుబడి పెంపు అంశాలపై రైతులకు సూచనలు చేశారు. పి.ఎం.డి.ఎస్. (గ్రావీణా) విధానం ద్వారా భూమిలో సహజసిద్ధంగా నత్రజని, కార్బన్ పదార్థాలు పెరిగి నేల సారవంతంగా మారుతుందని, తేమ ఎక్కువకాలం నిల్వ ఉండటంతో నీటి వినియోగం తగ్గుతుందని వివరించారు.ప్రకృతి వ్యవసాయం రైతులకు తక్కువ ఖర్చుతో అధిక లాభాలు అందించే వ్యవసాయ విధానమని పేర్కొంటూ, స్థానిక ప్రకృతి వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి ఈ పద్ధతులను అనుసరించాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మురళి, రంగస్వామి, ఎంఈపీఈవోలు రఫీ, విజయ్, లలితతో పాటు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# గుత్తి కేజీబీవీలో లింగ వివక్షత, పల్స్ పోలియోపై అవగాహన శిబిరం

**అనంతపురం/గుత్తి, జూన్ 25:( రిపబ్లిక్ న్యూస్ )**
గుత్తి మండలంలోని కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయం (కేజీబీవీ)లో విద్యార్థినుల కోసం లింగ వివక్షత నిర్మూలన, బాల్య వివాహాల నివారణ మరియు పల్స్ పోలియో కార్యక్రమంపై అవగాహన శిబిరం నిర్వహించారు.
ఈ సందర్భంగా డిప్యూటీ హెచ్ఈఓ సి. వెంకటేష్ మాట్లాడుతూ ఆడ, మగ అనే తేడా లేకుండా ఇద్దరూ సమానమేనని అన్నారు. ఆడబిడ్డ పుట్టుకను కూడా మగబిడ్డ పుట్టుకను స్వాగతించినంత ఆనందంగా స్వీకరించాలని సూచించారు. లింగ వివక్షత అనే సామాజిక దురాచారాన్ని సమాజం నుంచి పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందన్నారు.




బాల్య వివాహాలు ఆధునిక సమాజ అభివృద్ధికి అడ్డంకిగా మారాయని పేర్కొన్న ఆయన, ఈ దురాచారాన్ని సమాజం నుంచి తొలగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. బడి మానేసిన పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించి, "పెళ్లి కాదు.. చదువే ముఖ్యం" అనే భావనను పెంపొందించాలని అన్నారు. ఆడబిడ్డల భవిష్యత్ అభివృద్ధి, మహిళా సాధికారత కోసం బాల్య వివాహాలను అరికట్టడం ఎంతో అవసరమని తెలిపారు. బాల్య వివాహాలు నిర్వహించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు.
అలాగే ఈ నెల 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి, పోలియో వ్యాధి బారిన పడకుండా రక్షించుకోవాలని సూచించారు.

# విద్యార్థుల స్వరానికి కాంగ్రెస్ వేదిక

"ఛాత్రోన్ కీ గూంజ్"లో విద్య, ఉపాధి సమస్యలపై యువత ఆవేదన
విద్యార్థుల డిమాండ్లను జాతీయ నాయకత్వానికి చేరవేస్తాం: డీసీసీ అధ్యక్షుడు క్రాంతి నాయుడు బోయ





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 25)**
అఖిల భారత కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన "ఛాత్రోన్ కీ గూంజ్" విద్యార్థుల సంప్రదింపుల సమావేశంలో విద్యార్థులు, యువజన ప్రతినిధులు, విద్యావేత్తలు, కాంగ్రెస్ నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.సమావేశంలో విద్యార్థులు ప్రస్తుత విద్యా వ్యవస్థలో ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ప్రస్తావించారు. ముఖ్యంగా నీట్, జేఈఈ వంటి పోటీ పరీక్షల ఒత్తిడి, కోచింగ్ సెంటర్లపై ఆధారపడాల్సిన పరిస్థితి, పెరుగుతున్న విద్యా ఖర్చులు, పరీక్షల నిర్వహణలో లోపాలు, పేపర్ లీకులు, విద్య పూర్తయ్యాక ఉద్యోగ అవకాశాల కొరత వంటి అంశాలపై తమ ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు క్రాంతి నాయుడు బోయ మాట్లాడుతూ, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, వారి ప్రతిభను కేవలం ఒక పరీక్ష లేదా ర్యాంక్‌తో కొలవడం సరైన విధానం కాదని పేర్కొన్నారు.

**ప్రభుత్వ విద్యా సంస్థల బలోపేతానికి డిమాండ్**
విద్య అందరికీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ విద్యా సంస్థలను మరింత బలోపేతం చేయాలని, విద్యార్థుల మానసిక ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక వ్యవస్థలు ఏర్పాటు చేయాలని సమావేశంలో పాల్గొన్న వారు కోరారు.

**విద్యార్థుల సూచనలతో సంస్కరణల కోసం పోరాటం**
సమావేశంలో విద్యార్థులు వెల్లడించిన అభిప్రాయాలు, సూచనలు, డిమాండ్లను కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకత్వానికి నివేదించి, విద్యా రంగంలో సమగ్ర సంస్కరణల కోసం పోరాటం కొనసాగిస్తామని నాయకులు హామీ ఇచ్చారు. "విద్యార్థుల స్వరం దేశ భవిష్యత్తుకు మార్గదర్శకం కావాలి" అనే సంకల్పంతో కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అనుబంధ విభాగాల నాయకులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, యువజన నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కర్నూలులో చంద్రబాబుపై ఎస్వీ మోహన్ రెడ్డి తీవ్ర విమర్శలు

జొన్నగిరి గోల్డ్ మైన్ నుంచి రాయలసీమ ప్రాజెక్టుల వరకు పలు అంశాలపై స్పందన

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 25)**
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటీవల చేసిన వ్యాఖ్యలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కర్నూలులో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జొన్నగిరి గోల్డ్ మైన్ ప్రాజెక్టు విషయంలో చంద్రబాబు వాస్తవాలను వక్రీకరిస్తున్నారని ఆరోపించారు.
జొన్నగిరి గోల్డ్ మైన్ ప్రాజెక్టుకు తానే కర్త, కర్మ, క్రియ అన్నట్టుగా చంద్రబాబు మాట్లాడుతున్నారని, ఆయన ఇటీవల రెండో ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారని, అయితే అప్పటికే మొదటి ప్లాంట్ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.
ప్రాజెక్టు ద్వారా 5 వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారని, అయితే స్థానిక యువతకు ఉద్యోగ భద్రత కల్పించేందుకు మైనింగ్ సంస్థతో ప్రభుత్వం ఎలాంటి అవగాహన ఒప్పందం (ఎంఓయూ) చేసుకుందో వెల్లడించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న ఉద్యోగాల్లో కూడా స్థానికులు ఎక్కువగా కూలీలుగానే పనిచేస్తున్నారని అన్నారు.




రాయలసీమ అభివృద్ధి విషయంలో చంద్రబాబు సమాధానం చెప్పాలని కోరిన ఆయన, 17 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలో ప్రాంతానికి చేసిన మేలేమిటో వివరించాలని ప్రశ్నించారు. ఒక్క ఇరిగేషన్ ప్రాజెక్టును ప్రారంభించి పూర్తి చేయలేదని, కేవలం ప్రచారానికే పరిమితమయ్యారని విమర్శించారు.
గుండ్రేవుల, వేదవతి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేసి వదిలేశారని ఆరోపించిన మోహన్ రెడ్డి, గుండ్రేవుల ప్రాజెక్టు విషయంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి సమస్య పరిష్కరించే ప్రయత్నం చేయడం లేదన్నారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని నిలిపివేసిన చంద్రబాబు, గుండ్రేవుల ప్రాజెక్టుకు అనుమతులు తీసుకురాలేరా అని ప్రశ్నించారు.
కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో హత్యలు, దాడులు పెరిగాయని ఆరోపించిన ఆయన, వైఎస్సార్‌సీపీని "గొడ్డలి పార్టీ"గా అభివర్ణించే నైతిక హక్కు టీడీపీకి లేదన్నారు. కొన్ని సంఘటనలను ప్రస్తావిస్తూ రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు.
మత, కుల రాజకీయాలపై కూడా స్పందించిన మోహన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆలయాలు, మసీదులు, చర్చిలకు వెళ్లడాన్ని రాజకీయ అంశంగా మార్చడం సరికాదన్నారు. కుల, మతాల మధ్య విభేదాలు సృష్టించే విధంగా అధికార పక్ష నాయకులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు.
చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని సూచించిన ఆయన, రానున్న రోజుల్లో ప్రజలే వారికి తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:2023/87888



# ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరి

## డీఎంహెచ్‌వో డా. ఈ.బి. దేవి



**అనంతపురం ప్రతినిధి, జూన్ 25,(రిపబ్లిక్ న్యూస్):**
ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ఈబీదేవి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈనెల 28న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. జాతీయ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో భాగంగా నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై గురువారం ఆమె పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు.

**బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో మొబైల్ బృందాలు ఏర్పాటు**
ఈ సందర్భంగా డాక్టర్ ఈ బి దేవి మాట్లాడుతూ జిల్లాలో 0 నుంచి 5 సంవత్సరాల లోపు వయస్సు గల 2,83,430 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని తెలిపారు. ఇందుకోసం 5,247 మంది సిబ్బందిని నియమించగా, గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో కలిపి 1,623 పోలియో బూత్‌లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ఇతర జనసమ్మర్ధ ప్రాంతాల్లో సేవలందించేందుకు 58 ప్రత్యేక బృందాలు, 68 మొబైల్ బృందాలు పనిచేస్తాయని చెప్పారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో పోలియో చుక్కలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. మొదటి రోజు పోలియో చుక్కలు వేయించుకోని చిన్నారులను గుర్తించేందుకు జూన్ 29, 30 తేదీల్లో ఇంటింటి సర్వే నిర్వహించి ప్రతి చిన్నారికి టీకా అందేలా చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమం విజయవంతానికి వైద్యశాఖతో పాటు మహిళా శిశు సంక్షేమ, పంచాయతీరాజ్, పురపాలక శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.
తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సీడీపీవోలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని వైద్యాధికారులను ఆదేశించినట్లు తెలిపారు. జిల్లాలోని వైద్యాధికారులకు జూమ్ సమావేశం ద్వారా శిక్షణ, సూచనలు అందజేస్తామని చెప్పారు.
ఐదేళ్ల లోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి, పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తల్లిదండ్రులకు డా. ఈ.బి. దేవి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా టీకాల అధికారి ప్రసన్నభారతి, ప్రోగ్రాం అధికారి విష్ణుమూర్తి, మలేరియా అధికారి ఓబులు, డెమో అధికారి నాగరాజు, డిప్యూటీ డెమో లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర సమరయోధుల సేవలకు గుర్తింపుగా కేంద్ర అత్యున్నత సేవా పురస్కారం



**అనంతపురం / గుత్తి, జూన్ 25 (రిపబ్లిక్ న్యూస్)**
అనంతపురం జిల్లా పెద్దవడుగూరు గ్రామానికి చెందిన స్వాతంత్ర సమరయోధుల కుటుంబ సభ్యుడు ఎద్దుల సూర్యనారాయణ రెడ్డి కేంద్ర ప్రభుత్వం అందించే ప్రతిష్ఠాత్మక అత్యున్నత సేవా పురస్కారాన్ని అందుకున్నారు. దేశ రాజధాని న్యూఢిల్లీ లో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షేకావత్ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని స్వీకరించారు.
స్వాతంత్ర సమరయోధుడు శరభయ్య తో కలిసి స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొని జైలు జీవితం అనుభవించడంతో పాటు, స్వాతంత్ర్యం సాధనలో మరియు అనంతర కాలంలో సమాజానికి అందించిన విశిష్ట సేవలను గుర్తిస్తూ కేంద్ర సాంస్కృతిక వనరుల శిక్షణ కేంద్రం (సీసీర్ట్ ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డీడీసీ ప్రాజెక్ట్ ద్వారా ఈ గౌరవ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర రాష్ట్రానికి చెందిన 102 ఏళ్ల స్వాతంత్ర సమరయోధుడు లక్షణ్ రావు బొటే కూడా ఇదే పురస్కారాన్ని అందుకోవడం విశేషం.
ఈ సందర్భంగా కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షేకావత్ మాట్లాడుతూ, స్వాతంత్ర సమరయోధుల త్యాగాలు అమూల్యమైనవని, వారి పోరాట స్ఫూర్తి నేటి యువతకు స్ఫూర్తిదాయకంగా నిలవాలని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం తమ జీవితాలను అంకితం చేసిన మహనీయులను గౌరవించడం ప్రతి భారతీయుడి బాధ్యత అని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో ఎద్దుల సూర్యనారాయణ రెడ్డి కుమారుడు శరత్ రెడ్డి, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయభాస్కర్, డీడీసీ ప్రాజెక్ట్ బ్రాండ్ అంబాసిడర్ సోమిశెట్టి సరళ, అఖిల భారత స్వాతంత్ర సమరయోధుల సంఘం కార్యదర్శి రాంపిల్ల జయప్రకాష్ తదితరులు పాల్గొని అభినందనలు తెలిపారు. ఈ పురస్కారం అనంతపురం జిల్లాకు గర్వకారణమని, స్వాతంత్ర సమరయోధుల సేవలను భావితరాలకు చేరవేయడంలో ఇది మరింత ప్రేరణనిస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు. "స్వాతంత్ర సమరయోధుల సేవలకు కేంద్ర అత్యున్నత సేవా పురస్కారం పెద్దవడుగూరు వాసి ఎద్దుల సూర్యనారాయణ రెడ్డికి అరుదైన గౌరవం"

# సచివాలయ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

## కార్తీక్ మృతి ఉద్యోగులపై పెరుగుతున్న పనిభారం, ఒత్తిడికి నిదర్శనం

## సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. నాగేంద్ర కుమార్



**అనంతపురం / బెలుగుప్ప, జూన్ 25, (రిపబ్లిక్ న్యూస్):**
అనంతపురం జిల్లా బెలుగుప్ప మండలం నరసాపురం గ్రామ సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ కార్తీక్ అకాల మరణం రాష్ట్రంలోని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న తీవ్ర పనిభారం, మానసిక ఒత్తిడి, సిబ్బంది కొరతకు నిదర్శనమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. నాగేంద్ర కుమార్ పేర్కొన్నారు.

**ఒత్తిడి సంబంధిత కారణాలతో ప్రాణాలు కోల్పోయారు**
ఈ సందర్భంగా నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ ప్రజల వద్దకు పాలన పేరుతో ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థలో ఉద్యోగులపై అనేక శాఖల బాధ్యతలను మోపడం, నిరంతర సర్వేలు, లక్ష్యాలు, సమీక్షలు, సిబ్బంది కొరత కారణంగా ఉద్యోగులు తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే పలువురు సచివాలయ ఉద్యోగులు గుండెపోటు, ఒత్తిడి సంబంధిత కారణాలతో ప్రాణాలు కోల్పోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలపై ఇటీవల రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, గ్రామ-వార్డు సచివాలయ ఉద్యోగుల పదోన్నతుల గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ సభ్యుడు సత్యకుమార్ గారిని ఉద్యోగ సంఘాల నాయకులు కలిసి వినతిపత్రం అందజేయడం స్వాగతించదగ్గ పరిణామమని అన్నారు.

**సీనియర్ అసిస్టెంట్ స్థాయికి తగ్గకుండా పదోన్నతులు కల్పించాలి**
ఉద్యోగులకు మూడు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయడం, ఆరు సంవత్సరాల సర్వీసు పూర్తి చేసిన వారికి ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీం అమలు చేయడం, తొమ్మిది నెలల వేతన బకాయిలు చెల్లించడం, వెంటనే సీనియారిటీ జాబితాలు విడుదల చేసి పదోన్నతులు కల్పించడం వంటి డిమాండ్లు న్యాయమైనవేనని పేర్కొన్నారు. వార్డు సంక్షేమ అభివృద్ధి కార్యదర్శులు, వార్డు పరిపాలన కార్యదర్శులు, డేటా ప్రాసెసింగ్ కార్యదర్శులు, పారిశుధ్య పర్యావరణ కార్యదర్శులు, మౌలిక సదుపాయాల కార్యదర్శులు, ప్లానింగ్ కార్యదర్శులతో పాటు గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న విద్యా, సంక్షేమ సహాయకులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సర్వేయర్లు, వీఆర్వోలు, మహిళా పోలీసులకు సీనియర్ అసిస్టెంట్ స్థాయికి తగ్గకుండా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా నగర ప్రాంతాల్లో పనిచేస్తున్న సచివాలయ కార్యదర్శులు లేవనెత్తిన సమస్యలు కూడా అత్యంత ప్రాధాన్యత కలిగినవని అన్నారు. క్యాజువల్ లీవ్ మంజూరులో జాప్యాలు, పనిచేయని ప్రింటర్లు, తాగునీరు లేకపోవడం, మరుగుదొడ్ల సౌకర్యాల కొరత, ముఖ్యంగా మహిళా ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తక్షణమే పరిష్కరించాలని కోరారు. ప్రతిరోజూ వివిధ రకాల సర్వేలు, ఆన్‌లైన్ సేవలు నిర్వహించేందుకు ఉద్యోగులు తమ సొంత సెల్‌ఫోన్లు, ఇంటర్నెట్ వినియోగించాల్సి వస్తోందని, ఫోన్ మరమ్మతులు, డేటా ఖర్చులు ఉద్యోగులపై అదనపు భారంగా మారాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ఉద్యోగులకు అధికారిక మొబైల్ పరికరాలు, ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్తీక్ మరణం వంటి విషాదాలు పునరావృతం కాకుండా సిబ్బంది ఖాళీలను భర్తీ చేయడం, పనిభారం తగ్గించడం, ఉద్యోగ భద్రత కల్పించడం, మానవీయ దృక్పథంతో పరిపాలన సాగించడం ప్రభుత్వ తక్షణ బాధ్యత అని అన్నారు. ఉద్యోగుల ఆరోగ్యం, ప్రాణాల కంటే ఏ లక్ష్యాలు, ఏ గణాంకాలు ముఖ్యమైనవి కావని ప్రభుత్వం గుర్తించాలని సీఐటీయూ డిమాండ్ చేసింది.

# గుత్తిలో ఘనంగా మొహరం వేడుకలు..

## వైసీపీ నేత గంటా నరహరి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ





**అనంతపురం/ గుత్తి, జూన్ 25 (రిపబ్లిక్ న్యూస్)**
గుత్తి పట్టణంలో మొహరం వేడుకలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించబడ్డాయి. మొహరం సందర్భంగా పట్టణంలోని ప్రధాన వీధులు, మఖానాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ముస్లిం సోదరులతో పాటు అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మత సామరస్యాన్ని చాటారు. పట్టణమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, మొహరం వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గంటా నరహరి ఆధ్వర్యంలో కొత్తూరు నుంచి మెయిన్ బజార్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. వందలాది వాహనాలతో కూడిన కాన్వాయ్, మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, సంప్రదాయ కళారూపాల మధ్య ర్యాలీ ఉత్సాహభరితంగా సాగింది. ర్యాలీ మార్గమంతా ప్రజలు పెద్ద సంఖ్యలో చేరుకుని స్వాగతం పలికారు. యువకులు డప్పుల నృత్యాలు చేస్తూ వేడుకలకు మరింత శోభను తెచ్చారు.
అనంతరం గంటా నరహరి పట్టణంలోని ప్రముఖ పగ్గాల పీర్లు, భారే హిమాం, బొడ్డు పీర్ల మఖాన్లను సందర్శించారు. అక్కడ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి చక్కెరలు చదివించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, అభివృద్ధి కలగాలని ప్రార్థించినట్లు తెలిపారు. మఖాన్ల నిర్వాహకులు, మత పెద్దలు గంటా నరహరికి ఘన స్వాగతం పలికి ప్రత్యేక దీవెనలు అందజేశారు.
ఈ సందర్భంగా మాట్లాడిన గంటా నరహరి మొహరం పర్వదినం త్యాగం, ధర్మం, మానవతా విలువలకు ప్రతీక అని పేర్కొన్నారు. మత భేదాలు లేకుండా అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి వేడుకలను నిర్వహించడం గుత్తి ప్రాంత విశిష్టత అని అన్నారు. సమాజంలో శాంతి, సామరస్యం, సోదరభావం మరింత పెంపొందాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ ఐక్యంగా ఉండి ప్రాంత అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు, మత పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మొహరం వేడుకల సందర్భంగా గుత్తి పట్టణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుని సందడిగా మారింది. రాత్రి వరకు కొనసాగిన వేడుకల్లో భక్తులు ఉత్సాహంగా పాల్గొని తమ భక్తి భావాన్ని చాటుకున్నారు.

# రైతుల పొలాలలో మొక్కలు నాటు కార్యక్రమం






**ఓర్వకల్లు ప్రతినిధి, జూన్ 25(రిపబ్లిక్ న్యూస్)**
గురువారం రోజు రైతుల పొలాలలో మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా మన మండలంలో 50 ఎకరాలు శాంక్షన్ తీసుకోవడం జరిగింది 29 మంది రైతులు. గురువారం ఓర్వకల్లు మండలంహుసేనాపురం గ్రామపంచాయతీలో మండల కన్వీనర్ అయినటువంటి నాగిరెడ్డి మరియు హుస్నాపురం నాయకులు అందరూ కలిసి మొక్కలను రైతులకు పంపిణీ చేయడం జరిగినది చేయడం జరిగినది అనంతరం కాల్వ గ్రామపంచాయతీలో మండల కన్వీనర్ అయినటువంటి నాగిరెడ్డి కాల్వ నాయకులు రజాక్ మిగతావారు గ్రామ ప్రజలు ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది అందరూ పాల్గొని రైతు పొలంలో మొక్కలు నటించే కార్యక్రమం చేపట్టడం జరిగినది

# గుర్తుతెలియని వ్యక్తి మృతి



**అనంతపురం / గుంటకల్ క్రైమ్, జూన్ 25,(రిపబ్లిక్ న్యూస్):**
గుంటకల్ రైల్వే స్టేషన్‌లో గురువారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో స్టేషన్‌లోని ప్లాట్‌ఫాం నెం.2 వద్ద ఉన్న పిల్లర్ కట్టపై ఓ వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. మృతుడి వయస్సు సుమారు 55 సంవత్సరాలు ఉండవచ్చని వారు తెలిపారు. చామనచాయ రంగు, 5 అడుగుల 4 అంగుళాల ఎత్తు, బలిష్టమైన శరీరాకృతి కలిగిన వ్యక్తిగా గుర్తించారు. మృతుడు నీలం-తెలుపు గీతల అడ్డ పంచ ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లేదా వివరాలు లభించలేదని పోలీసులు వెల్లడించారు. దీంతో అతని వివరాలు తెలుసుకునేందుకు గుంటకల్ రైల్వే పోలీసులు ప్రజల సహకారం కోరుతున్నారు. ఫోటోలోని వ్యక్తిని ఎవరైనా గుర్తించినా, అతని కుటుంబ సభ్యుల గురించి సమాచారం తెలిసినా గుంటకల్ రైల్వే పోలీస్ స్టేషన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌ను 9247575605 నంబర్‌లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

# మాజీ సి యం వై యస్ జగన్ ని కలిసిన రైల్వే డి ఆర్ సి మెంబర్ తల్లెం.



**రైల్వే కోడూరు జూన్ 25 రిపబ్లిక్ న్యూస్.**
రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వై యస్ జగన్మోహన్ రెడ్డి పులివెందుల పర్యటన సందర్భంగా గురువారం ఆయనను పులివెందుల క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు గుంతకల్లు రైల్వే డి ఆర్ సి మెంబర్, వైయస్సార్సీపి రాయలసీమ బూత్ కమిటీ కన్వీనర్ తల్లెం భరత్ కుమార్ రెడ్డి తెలిపారు, ఈ నేపథ్యంలో జగన్మోహన్ రెడ్డి ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న సర్ ప్రోగ్రాం గురించి అడిగి రైల్వేకోడూరు నియోజకవర్గ ప్రాంతాల్లో పనులు ఎలా జరుగుతున్నాయని ఎన్నుమరేషన్ పత్రాల పంపిణి, వాటికీ సంబంధించి ఏమైనా ఇబ్బందులు తలెత్తుతున్నాయా అని అడిగారన్నారు అంతే కాకుండా గ్రామాలలో ప్రజా సమస్యలను వెలికి తీసి ప్రజలకు సహాయంగా సమస్యలను అధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు అందరూ కృషి చేయాలని జగన్ మోహన్ రెడ్డి కోరారన్నారు, రైల్వే కోడూరు నియోజకవర్గంలో వైయస్సార్సీపి నాయకులు నిత్యం ప్రజాక్షేత్రంలో తిరుగుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్నారని, సర్ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు బిఎల్ఓ లతో కలిసి ప్రజలకు సమస్యలు తలెత్తకుండా అందుబాటులో ఉండి ఎన్నుమరేషన్ పత్రాల పంపిణీ విషయంలో జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారని జగన్మోహన్ రెడ్డికి తెలియజేశామన్నారు భరత కుమార్ రెడ్డితో కలిసి పలువురు నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు జగన్మోహన్ రెడ్డిని కలిసిన వారిలో ఉన్నారు

## అందోల్ నియోజకవర్గం ప్రజలకు మొహరం పండుగ శుభాకాంక్షలు

### సాక్షి డిజిటల్ న్యూస్ రిపోర్టర్ జెల్ల భాగయ్య



**ఆందోల్ ప్రతినిధి జూన్ 25 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్**
మతాలు వేరైనా మనుషులు ఒకటే మనిషిలోని మానవత్వాన్ని చాటి చెప్పే పవిత్ర పండగ మోహరం పండగ ముస్లింలకు ఆధ్యాత్మికంగా ఎంతో విశిష్టమైనది. త్యాగం, ధర్మం, సత్యం, మానవత్వం వంటి విలువలను చాటి చెప్పే ఈ పండగను కులమత విభేదాలకు అతీతంగా ప్రజలు కలిసి జరుపుకోవడం ప్రత్యేకత గ్రామాలలో పట్టణాలలో హిందూ ముస్లిం సోదర భావానికి అతీతంగా ఈ పండగ వేడుకలు జరుపుకుంటారు. అందోల్ నియోజకవర్గం ప్రజలందరికీ మోహరం పండుగ శుభాకాంక్షలు

## అందోల్ జోగిపేట ప్రజలకు మొహరం పండుగ శుభాకాంక్షలు

### కాంగ్రెస్ సీనియర్ యువ నాయకుడు తుడుం అశోక్.



**ఆందోల్ ప్రతినిధి జూన్ 25 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్**
మతాలు వేరైనా మనుషులు ఒకటే మనిషిలోని మానవత్వాన్ని చాటి చెప్పే పవిత్ర పండగ మోహరం పండగ ముస్లింలకు ఆధ్యాత్మికంగా ఎంతో విశిష్టమైనది. త్యాగం, ధర్మం, సత్యం, మానవత్వం వంటి విలువలను చాటి చెప్పే ఈ పండగను కులమత విభేదాలకు అతీతంగా ప్రజలు కలిసి జరుపుకోవడం ప్రత్యేకత గ్రామాలలో పట్టణాలలో హిందూ ముస్లిం సోదర భావానికి అతీతంగా ఈ పండగ వేడుకలు జరుపుకుంటారు. అందోల్ నియోజకవర్గం ప్రజలందరికీ మోహరం పండుగ శుభాకాంక్షలు

## అల్మాయిపేట్ గ్రామంలో ఎస్ ఐ ఆర్ పైన సర్పంచ్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలోఅవగాహన సదస్సు



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూన్ 25( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**

అందోల్ మండలం అల్మాయపేట గ్రామంలో గ్రామ సర్పంచ్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో భాగంగా బూత్ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు ఈ సమావేశానికి ఎస్ ఐ ఆర్ గ్రామ ఇంచార్జ్ పాండు బి ఎల్ వో లు పాల్గొన్నారు ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ జూన్ 25 నుంచి జూలై 24 వరకు జరుగుతున్న ఓటర్ సవరణ కార్యక్రమంలో గ్రామములో బి ఎల్ వో లు ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ సవరణ ఫారాలపై పూర్తిగా సమర్థవంతంగా పనిచేసి ఈ ఓటర్ సవరణ కార్యక్రమానికి గ్రామంలో ఉన్న ప్రజలు అందరూ సహకరించాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి ఎల్ ఓ లు గ్రామ ప్రజలు పాల్గొన్నారుద

## నేరడి గుంట మక్తగూడెం గ్రామానికి అభివృద్ధికి సహకరించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ను కలిసి వినతి పత్రం సమర్పించిన నేరెడుగుంట సర్పంచ్ ఒగ్గు సాయికిరణ్



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూన్ 25 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**

అందోల్ మండలం నేరడిగుంటమక్తగూడెం గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధికి సంబంధించిన పలు అభివృద్ధి పనులపై నేడు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ని గ్రామ సర్పంచ్ వొగ్గు సాయికిరణ్ యాదవ్ గారు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు.

ఈ సందర్భంగా గ్రామానికి అవసరమైన మౌలిక సదుపాయాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనుల అమలుపై కలెక్టర్ గారితో సవివరంగా చర్చించడం జరిగింది. వినతిపత్రాన్ని పరిశీలించిన కలెక్టర్ గారు సమస్యలపై సానుకూలంగా స్పందించి, సంబంధిత శాఖల అధికారులకు అవసరమైన చర్యలు చేపట్టాలని వెంటనే ఆదేశాలు జారీ చేశారు.గ్రామాభివృద్ధికి జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తామని కలెక్టర్ గారు హామీ ఇవ్వగా, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తామని సర్పంచ్ వొగ్గు సాయికిరణ్ యాదవ్ గారు తెలిపారు.

## ఎస్ ఐ ఆర్ ఓటర్ సవరణ కార్యక్రమాన్ని పరిశీలించి న ఆర్డీవో రమేష్ బాబు ఎమ్మార్వో మధుకర్ రెడ్డి





**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూన్ 25( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**

అందోల్ జోగిపేట పట్టణంలో ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రేవిషన్ )2026 కార్యక్రమాన్ని ఆర్డీఓ రమేష్ బాబు, ఎమ్మార్వో సాగర్ మధుకర్ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు ప్రతి షాపు, ప్రతి ఇంటిని సందర్శిస్తూ ఓటరు వివరాల సేకరణ, ధృవీకరణ ప్రక్రియను పర్యవేక్షించారు.ఓటరు జాబితాలో ప్రతి అర్హుడైన ఓటరు పేరు నమోదు కావడం, తప్పులు సరిదిద్దడం, చిరునామా మార్పులు మరియు ఇతర వివరాలను నవీకరించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. ప్రజలు తమ వివరాలను పరిశీలించి, ఎన్యూమరేషన్ ఫారాలను సక్రమంగా పూర్తి చేసి ఎన్నికల సిబ్బందికి అందించాలని సూచించారు. తెలంగాణలో ఎస్ఐఆర్2026 కార్యక్రమం జూన్ 25 నుండి ప్రారంభమై, బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి వివరాల సేకరణ చేపడుతున్నారని ఎన్నికల అధికారులు వెల్లడించారు.

## అంగన్వాడీలోని విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

### జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్





**మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 25( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**

గురువారం నర్సాపూర్ మండలంలోని అచ్చంపేట్ అంగన్వాడి కేంద్రాన్ని ఆర్డీవో తాహసిల్దార్ తో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. అంగన్వాడీ విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం బలవర్ధకమైన సంపూర్ణ పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. అంగన్వాడీలలో పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. తక్కువ బరువు ,ఎత్తు తక్కువ ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈకార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బంగారం చోరీ కేసులో నిందితులు అరెస్ట్.





### డి.ఎస్.పి శ్రీనివాసరావు.

**రైల్వే కోడూరు జూన్ 25 రిపబ్లిక్ న్యూస్.**

ఓబులవారిపల్లి మండలం వైకోట పంచాయతీకి చెందిన ఎద్దుల వారి పల్లి గ్రామం నందు ఎన్ఆర్ అనంతమ్మ భర్త ప్రసాద్ తన అన్న ఎద్దులు ఈశ్వరయ్య పాత ఇంటిలో బీరువాలో బంగారం పెట్టి కువైట్ కు వెళ్లి తిరిగి వచ్చి ఈనెల 19వ తేదీన చూసుకోగా బీరువాలో 10 తులాలు బంగారం రెండు గొలుసులు చైనులను రెండు బంగారు హారాలు మాటీలు చెంపచవరాలు ఇతరత్రా 11 లక్షల కు విలువ చేసే బంగారు దొంగిలించడం జరిగినది . మౌనిక ఫిర్యాదు మేరకు బెడ్రూమ్లో పెట్టిన బంగారం 9 తులాలు వాటి విలువ 9 లక్షల 90 వేల రూపాయలు విలువ చేసే బంగారాన్ని ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు ఫిర్యాదు చేశారని పోలీసుల విచారణలో గాలింపు చర్యలు చేపట్టి దొంగిలించిన వారిని ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 18.70,విలువ చేసే బంగారం 19 తులాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్ పంపుతున్నట్లు రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు ఎక్కడ చోరీలు జరగకుండా ఎటువంటి అవాంఛనీలు సంఘటనలు జరగకుండా పోలీస్ కవాతి నిర్వహించి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో పుల్లంపేట సీఐ శ్రీనివాసులు ఓబులవారిపల్లి ఎస్సై సుజన్ కుమార్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు డి.ఎస్.పి ఈ కేసును చేదించిన అధికారులు సిబ్బంది ని, జిల్లా ఎస్ పీ ఎల్ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో జరగబోయే క్రైమ్ సమావేశంలో వీరికి రివార్డులో అందజేయనున్నట్లు సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు తెలియజేశారు.

## మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రుల కలయిక చరిత్రలో నిలిచిపోతుంది

### తుంగభద్ర ప్రాజెక్టు కొత్త గేట్ల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే దగ్గుపాటి- కార్యక్రమంలో పాల్గొనడం తనకు గర్వంగా ఉంది

### సీఎం చంద్రబాబుతో పాటు పలువురు ప్రముఖులను కలిసిన ఎమ్మెల్యే దగ్గుపాటి





**అనంతపురం సంక్షేమం, జూన్ 25, (రిపబ్లిక్ న్యూస్):**

మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చొరవ.. మూడు రాష్ట్రాల రైతుల ప్రయోజనాలు కాపాడేందుకు నాంది పలికిందని.. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. కర్ణాటక రాష్ట్రం హోసపేటలో జరిగిన తుంగభద్ర ప్రాజెక్టు కొత్త గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్వాగతం పలికారు. తుంగభద్ర ప్రాజెక్టుకు కొత్తగా అమర్చిన గేట్ల ప్రారంభం చారిత్రాత్మక ఘట్టమని, ఇది ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల రైతులకు మరియు ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం తనకు గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సి ఆర్ పాటిల్ తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డ్యాం గేట్ల నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన ఇంజనీర్ కన్నయ్య నాయుడు గారిని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అభినందించారు. రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడులను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం తుంగభద్ర జలాశయం మరియు కొత్తగా ఏర్పాటు చేసిన డ్యాం గేట్లను సహచర ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఈ ప్రాజెక్టు భవిష్యత్తులో సాగునీటి అవసరాలకు మరింత బలాన్నిస్తుందని, రైతులకు దీర్ఘకాల ప్రయోజనాలు అందిస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం తుంగభద్ర ప్రాజెక్టు ఆధునీకరణలో ఒక కీలక మైలురాయిగా నిలిచిందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు.

## ఘనంగా నగర అధ్యక్షుడు ఇమామ్ జన్మదిన వేడుకలు

**అనంతపురం సంక్షేమం, జూన్ 25,(రిపబ్లిక్ న్యూస్):**

అనంతపురం నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ ఇమామ్ వలి జన్మదిన వేడుకలు గురువారం స్థానిక జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ శుభ సందర్భంగా నగర కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నగర అధ్యక్షుడి చేతుల మీదుగా పార్టీ శ్రేణుల సమక్షంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, మైనార్టీ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థలు పెద్ద ఎత్తున హాజరై నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ ఇమామ్ వలి కు దుశ్శాలువాలు, పుష్ప గుచ్ఛాలతో ఘనంగా సత్కరించి జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు.

**అధిష్టానం ఆదేశించిన కార్యక్రమాలను ప్రజల్లో తీసుకొని వెళ్తా**

ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు షేక్ ఇమామ్ వలి మాట్లాడుతూ తన జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నగర కమిటీ ఆధ్వర్యంలో పవిత్రమైన మొహర్రం నెల మాసంలో నగర అధ్యక్షుడి హోదాలో జన్మదిన వేడుకలను జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన నగర కాంగ్రెస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను ఆయన ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. అదేవిధంగా తన పుట్టినరోజు శుభ సందర్భంగా హాజరైన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, మైనార్టీ నాయకులు మరియు సోషల్ మీడియా ద్వారా పరోక్షంగా, ప్రత్యక్షంగా శుభాంక్షలతో కూడిన ఆశీస్సులు అందజేసిన ఆత్మీయ మిత్రులందరికీ పేరు పేరున ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా రాబోవు రోజుల్లో మీ అందరి ఆశీస్సులతో ప్రజల దీవెనలతో మరింత రెట్టింపు ఉత్సాహంతో కాంగ్రెస్ పార్టీ గౌరవ వైభవం కోసం కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశించిన కార్యక్రమాలను ప్రజల్లో తీసుకొని వెళ్తానని దానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజీ బషీర్ అహ్మద్, పింది భాష సుధాకర్ జాకీర్, ఇర్షాద్, సాదిక్, నూరుల్లా, అబ్దుల్, నరసింహారెడ్డి శ్రీనివాసులు, లోకానాథం, హనీఫ్, బాబా ఫక్రుద్దీన్, గరీబ్ దర్ద్ ట్రస్ట్ జిలాన్, కూలర్ మసూద్, సాదిక్ పీరా, ప్రజా బలం చందు నాయక్, రాజు, చంద్ర, స్వామి తదితరులు పాల్గొన్నారు.





## మొహరం శుభాకాంక్షలు

### జోగిపేట మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ చిట్టిబాబు

**ఆందోల్ ప్రతినిధి జూన్ 25 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**

ఆందోల్ మండలం జోగిపేట పట్టణంలో పీర్ల పండుగ సందర్భంగా బిబి ఫాతిమా హలం వద్ద జోగిపేట మున్సిపల్ వైస్ చైర్మన్ సత్యనారాయణ ( చిట్టిబాబు ) దట్టి సమర్పించడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొహరం వేడుకలు అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధల మధ్య జరుపుకోవాలని ముస్లిం సోదరులతో పాటు అన్ని వర్గాల ప్రజలు కులమతాలకు అతీతంగా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో పండగను భక్తిశ్రద్ధలతో ఎలాంటి ఘర్షణలు జరగకుండా దుల బతుకమ్మ ఆటలు అంగరంగ వైభవంగా నిర్వహించుకునేలా అందరూ సహకరించాలని ప్రత్యేకంగా వారి విజ్ఞప్తి చేస్తూ ప్రతి ఒక్కరికి మొహరం శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ డైరెక్టర్ ఎండి ఖాలేదు కాంగ్రెస్ పార్టీ నాయకుడు సోహియల్ ఖాన్ అడ్డు బాయ్ వీరేశం చెన్నయ్య రమేష్ మురళి శ్రీను బత్తిని శ్రీధర్ కుమార్ షెరి సంగమేష్ సంత ఆబేద్ బాయ్ తదితరులు పాల్గొన్నారు







# ఇరాన్‌తో ఆయిల్ డీల్‌కు మళ్లీ అవకాశం !

**జూన్ 25, (రిపబ్లిక్ న్యూస్):**
ప్రపంచం బాగుండాలంటే ముందు ట్రంప్ దూకుడుకు అక్కడి పార్లమెంట్ కళ్లెం వేయాలి. ఇరాన్‌పై ఇంకా ఆంఇలు విధించడం, బెదిరించడం వంటివి చేయకుండా చూసుకోవాలి. ఎందుకంటే ఒక్క ట్రంప్ కారణంగా
ప్రపంచం యావత్తూ అతాలకుతలం అయ్యింది. సునీమా వచ్చినంత పనయ్యింది. మళ్లీ కోలుకోవడమెలా అన్న సందిగ్ధంలో ప్రపంచ దేశాలు ఉన్నాయి. అన్ని దేశాల ఆర్థిక స్థితి దిగజారింది. ముఖ్యంగా భారత్ లాంటి అనేక దేవాల్లో ఆర్థిక సంక్షోభం నెలకొంది. ఈ క్రమంలో ఇరాన్‌ను తన మానా తను బతికేలా చూడాలి. ట్రంప్ ఇక తన దేశ పురోగతికి సమయం కేటాయిస్తే చాలు. హర్మూజ్ తెరుచుకోవడం, చమురు ధరలు దిగిరావడం అన్నది ఊరటనిచ్చే అంశం. ముఖ్యంగా భారత్‌కు పెద్ద ఊరట అని చెప్పాలి. అలాగే భారత్ ఎవరి వద్ద చమురు కొనాలో వద్దో అన్నది అమెరికాకు సంబంధించిన వ్యవహారం కాదు. భారత్ ఎవరితో వాణిజ్యం చేయాలో చేస్తుంది. ఎవరితో చమురు డీల్ చేసుకోవాలో చేసుకుంటుంది. అంతేగానీ వేలుపెట్టాలని ఇక ట్రంప్ చేడడం మానుకోవాలి. ట్రంప్ తీరువల్ల అమెరికా ఇప్పటికీ పీకల్లోతు ఆర్థిక సంక్షోభంలో కూరుకు పోయింది. అక్కడా చమురు ధరలు పెరిగాయి. నిరుద్యోగం పెరిగింది. అక్కడున్న వారిని




వెళ్లేగొట్టే ప్రయత్నంలో తీసుకుంటున్న నిర్ణయాలు ప్రణసంకటంగా మారాయి. ముఖ్యంగా భారతీయ టెక్కీలకు ఇదొక సమస్యగా మారింది. ఇకపోతే చమురు ధరలు దిగిరావడం, మళ్లీ హర్మోజ్ తెరుచుకోవడం తో ఇక స్వేచ్ఛా వాణిజ్యానికి అవకాశం వచ్చింది. దీనిపై అటు ట్రంప్ కానీ, ఇటు ఇరాన్ కానీ పేచీలు లేకుండా చూసుకోవాలి. పశ్చిమాసియాలో యుద్ధం ముగియడంతో పాటు ఇరాన్ చమురుపై అమెరికా ఆంక్షలను సడలించడం వంటి కారణాలతో క్రూడాయిల్ ధరలు దిగొస్తున్నాయి.అటు బంగారం, వెండి ధరలు కూడా తగ్గుముఖం పట్టాయి. ఈ క్రమంలో భారత్–ఇరాన్ మధ్య ఇంధన రంగంలో మళ్లీ కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇరాన్ చమురు మంత్రి మొహ్సెన్ పక్‌నెజాద్ ఈ వారం భారత పెట్రోలియం మరియు సహజ వాయు మంత్రిత్వ శాఖ అధికారులతో సమావేశం కానున్న నేపథ్యంలో, భారత్‌కు ఇరాన్ నుంచి ముడి చమురు సరఫరాల భవిష్యత్తుపై ఆసక్తి నెలకొంది. దాదాపు ఏడేళ్ల విరామం తర్వాత ఈ ఏడాది ప్రారంభంలో పరిమిత స్థాయిలో ఇరాన్ చమురు దిగుమతులు తిరిగి ప్రారంభమయ్యాయి. అమెరికా ఆంక్షలకు ముందు భారత్‌కు ప్రధాన ముడి చమురు సరఫరాదారుల్లో ఇరాన్ ఒకటి. ముఖ్యంగా తక్కువ ధరలు, అనుకూల క్రెడిట్ సౌకర్యాలు, భారత రిఫైనరీలకు అనువైన నాణ్యత కారణంగా ఇరాన్ చమురుకు మంచి డిమాండ్ ఉండేది. భారత్–ఇరాన్ మధ్య జరగనున్న తాజా చర్చలు ఇంధన రంగంలో కొత్త అవకాశాలకు దారితీయవచ్చని నిపుణులు భావిస్తున్నారు. అయితే పూర్తి స్థాయిలో ఇరాన్ చమురు దిగుమతులు పునరుద్ధరించబడేందుకు ఇంకా సమయం పట్టే అవకాశం ఉందని, భవిష్యత్ కొనుగోళ్లు వాణిజ్య ప్రయోజనాలు, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు మరియు ఆంక్షల పరిస్థితులపై ఆధారపడి ఉంటాయని విశ్లేషకులు చెబుతున్నారు. 2015లో భారత్ సుమారు 11 మిలియన్ మెట్రిక్ టన్నుల ముడి చమురును ఇరాన్ నుంచి దిగుమతి చేసుకుంది. అది దేశ మొత్తం చమురు దిగుమతుల్లో 6 శాతం వాటాను కలిగి ఉంది. 2016లో ఈ దిగుమతులు 14 ఎంఎంటీలకు చేరి వాటా 6.7 శాతానికి పెరిగింది. అయితే, 2017లో ఇరాన్ నుంచి దిగుమతులు భారీగా పెరిగాయి. ఆ ఏడాది భారత్ 27 ఎంఎంటీల చమురును కొనుగోలు చేయగా, దేశ మొత్తం చమురు అవసరాల్లో ఇరాన్ వాటా 12.6 శాతానికి చేరుకుంది. ఇదే గరిష్ట స్థాయి. 2018లో దిగుమతులు 23 ఎంఎంటీలకు తగ్గినా, ఇరాన్ వాటా 10.4 శాతంగా కొనసాగింది. 2019లో 24 ఎంఎంటీల దిగుమతులతో ఇరాన్ వాటా 10.6 శాతంగా నమోదైంది. అయితే 2019 మేలో అమెరికా ఇరాన్‌పై ఆంక్షలను కఠినతరం చేసి, చమురు కొనుగోలు చేసే దేశాలకు ఇచ్చిన మినహాయింపులను రద్దు చేయడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. దీంతో భారత్ ఇరాన్ నుంచి చమురు కొనుగోళ్లను నిలిపి వేయాల్సి వచ్చింది. ఈ ప్రభావం 2020లో స్పష్టంగా కనిపించింది. ఆ ఏడాది భారత్ కేవలం 2 ఎంఎంటీల చమురును మాత్రమే ఇరాన్ నుంచి దిగుమతి చేసుకుంది. దీంతో దేశ మొత్తం చమురు దిగుమతుల్లో ఇరాన్ వాటా 1 శాతం కంటే దిగువకు పడిపోయింది. ఇటీవల నేషనల్ ఇరానియన్ ఆయిల్ కంపెనీ (ఎన్ఐఓసీ) భారత రిఫైనరీలు, వ్యాపార సంస్థలను సంప్రదించి భవిష్యత్ చమురు సరఫరాలపై చర్చలు ప్రారంభించి నట్లు సమాచారం. అయితే భారత ర్గి÷నైరీలు ప్రస్తుతం జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాయి. అమెరికా ఆంక్షలపై స్పష్టత, చెల్లింపు విధానాలు, షిప్పింగ్ మరియు బీమా సౌకర్యాలపై భరోసా లభించిన తర్వాతే పెద్ద ఎత్తున కొనుగోళ్లపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. కెప్లర్ డేటా ప్రకారం, జూన్ నెలలో భారత్ రోజుకు సుమారు 73 వేల బ్యారెళ్ల ఇరాన్ ముడి చమురును దిగుమతి చేసుకుంది. ఏప్రిల్‌లో పరిమిత స్థాయిలో పునఃప్రారంభమైన సరఫరాలు క్రమంగా పెరుగుతున్నట్లు ఇది సూచిస్తోంది.

----------

# పశ్చిమాసిమయాలో నెలకొంటున్న శాంతి

**ఉద్రిక్తతలు తగ్గడంతో మార్కెట్లో సానుకూల పరిస్థితి**

**72.28 డాలర్లకు పడిపోయిన బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర**

**బంగారం ధరలు కూడా భారీగా తగ్గుతున్నట్లు అంచనా**



**న్యూఢిల్లీ,జూన్ 25, (రిపబ్లిక్ న్యూస్):** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చల్లారడంతో చమురు రవాణాకు జీవనాడి అయిన హర్మూజ్ జలసంధిలో నౌకల రాకపోకలు వేగవంతం అవుతున్నాయి. దీంతో అంతర్జాతీయ మార్కెట్‌లో గత కొన్ని రోజులుగా చమురు ధరలు భారీగా దిగొస్తున్నాయి. తాజాగా బ్రెంట్ క్రూడ్ ధర అమెరికా–ఇరాన్ యుద్ధం ముందు స్థితికి పడిపోవడం ఊరటనిస్తోంది. గురువారం ఉదయం బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 72.28 డాలర్లకు పడిపోయింది. క్రితం సెషన్‌తో పోలిస్తే దీని ధర 4శాతం మేర తగ్గడం గమనార్హం. ఇక, వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియెట్ క్రూడాయిల్ ధర 1.69శాతం తగ్గి బ్యారెల్‌కు 69.15 డాలర్లు పలికింది. ఇటీవలి కాలంలో దీని ధర 70 డాలర్ల దిగువకు చేరడం ఇదే తొలిసారి. గడిచిన 24 గంటల్లో హర్మూజ్ జలసంధి మీదుగా కనీసం 2 కోట్ల బ్యారెళ్ల చమురు రవాణా అయినట్లు అమెరికా ఇంధన మంత్రిత్వశాఖ వెల్లడించింది. రాబోయే కొన్ని వారాల్లోనే ఈ జలమార్గంలో చమురు రవాణా యుద్ధం మునుపటి స్థాయికి పెరుగుతుందని అంచనా వేసింది. పశ్చిమాసియాలో యుద్ధం ముగియడంతో పాటు ఇరాన్ చమురుపై అమెరికా ఆంక్షలను సడలించడం వంటి కారణాలతో క్రూడాయిల్ ధరలు దిగొస్తున్నాయి.అటు బంగారం, వెండి ధరలు కూడా తగ్గుముఖం పట్టాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర 3996 డాలర్లకు చేరింది. వెండి (ధర 57.35 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. దీంతో హైదరాబాద్ విపణిలో గురువారం ఉదయం 24 క్యారెట్ల మేలిమి బంగారం 10 గ్రాముల ధర రూ. 1.44లక్షలు పలికింది. కిలో వెండి ధర రూ. 2.22లక్షలకు దిగొచ్చింది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో గోల్డ్ ఫ్యూచర్స్ ధర 1.41లక్షలు (10 గ్రాములకు), వెండి ఫ్యూచర్ ధర రూ. 2.13లక్షలుగా (కిలోకు) ట్రేడ్ అవుతోంది. మరోవైపు, దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు కూడా గురువారం లాభాల్లో కొనసాగాయి. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలకు తోడు.. దేశీయంగా బ్యాంకింగ్, స్థిరాస్తి రంగ సూచీల్లో కొనుగోళ్లు సూచీలకు మద్దతుగా నిలిచాయి. దీంతో ఉదయం 10 గంటల సమయంలో సెన్సెక్స్ 511.62 పాయింట్లు పెరిగి 77,502 వద్ద, నిఫ్టీ 150 పాయింట్ల లాభంతో 24,172 వద్ద ట్రేడ్ అవుతున్నాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 22 పైసలు పెరిగి 94.33 వద్ద కొనసాగుతోంది.

## గోడౌన్ కూలిన ఘటనలో 8కి చేరిన మృతుల సంఖ్య

**కొనసాగుతున్న సహాయక చర్యలు..సిఎం పర్యవేక్షణ**

**కోల్‌కతా,జూన్ 25, (రిపబ్లిక్ న్యూస్)::**మహానగరంలోని తరతల ప్రాంతంలో గోడౌన్ కుప్పకూలిన సంఘటనలో మరణించిన వారి సంఖ్య 8కి పెరిగింది. ఈ ఘటనలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించామని అధికారులు వివరించారు. మరో18 మంది గోడౌన్ శిథిలాల కింద చిక్కుకున్నారని తెలిపారు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో గోడౌన్‌లో 60 మంది వరకు కార్మికులు ఉన్నారని వివరించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, భారత ఆర్మీ, నగర పోలీసులతోపాటు స్థానికుల సహకారంతో సహయక చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ ప్రమాదంపై సమాచారం అందుకోగానే.. మంత్రులతో కలిసి సీఎం సువేందు అధికారి ఘటన స్థలానికి చేరుకున్నారు. స్వయంగా సహాయక చర్యలను పర్యవేక్షించారు. మరో వైపు బాధితుల కుటుంబ సభ్యుల కోసం రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ కంట్రోల్ రూం.. 8697981070, 033 22143526, 033 22535185 నెంబర్లు విడుదల చేసింది. బుధవారం సాయంత్రం ఈ గోడౌన్ కూలిన సంగతి తెలిసిందే. ఈ ఘటన జరిగిన వెంటనే ఐదుగురు కార్మికులు మరణించగా.. 20 మంది తీవ్రంగా గాయపడిన విషయం విదితమే.

# వెనిజువెలాకు మోడీ ఆపన్నహస్తం

**సాయం అందిస్తామని ప్రకటన -సాయం కోసం సిద్దంగా ఉన్నామన్న ట్రంప్**

**న్యూఢిల్లీ,జూన్ 25, (రిపబ్లిక్ న్యూస్):**



వెనెజువెలాలో సంభవించిన వరుస భూకంపాలతో భారీగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. ఇప్పటివరకు 32 మంది ప్రాణాలు కోల్పోగా.. 700 మంది వరకు గాయపడ్డారని తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ వెల్లడించారు. రాజధాని నగరం కరాకస్, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో భూకంప తీవ్రత ధాటికి భవనాలు కూలిపోవడంతో.. శిథిలాల కింద అనేక మంది చిక్కుకున్నారు. దాంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెప్తున్నారు. ఈ విపత్తు సమయంలో ఆదుకునేందుకు ప్రపంచ దేశాలు ఆపన్నహస్తం సాచాయి. వెనెజువెలా ప్రకృతి విలయంపై ప్రధాని మోదీ తీవ్ర విచారం వ్యక్తంచేశారు. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు. ఈ క్లిష్ట సమయంలో ఆ దేశానికి అండగా ఉంటామని ఎక్స్ వేదికగా వెల్లడించారు. సహాయసహకారాలు అందిస్తామని ప్రకటించారు. వెనెజువెలా ప్రజలకు సహాయం చేయడానికి అమెరికా సిద్ధంగా ఉందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ట్రూత్‌లో పోస్టు పెట్టారు. ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టేలా సంసిద్ధంగా ఉండాలని అన్ని ఏజెన్సీలను ఆదేశించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా వెనెజువెలా ప్రజలను గొప్ప స్నేహితులుగా అభివర్ణించారు. ఇప్పటికే సహాయక బృందాలను మోహరించామని అమెరికా విదేశాంగమంత్రి మార్కో రూబియో వెల్లడించారు.

# ట్రిపుల్ తలాక్ ఉండాల్సిందే

**బహుభార్యత్వం కూడా సమర్థనీయమే**

**మహారాష్ట్ర అసెంబ్లీలో ఎన్‌సిపి ఎమ్మెల్యే సనా మాలిక్ వ్యాఖ్యలు**

**తిప్పికొట్టిన బిజెపి ఎమ్మెల్యేలు..పాక్‌కు వెళ్లాలని హితవు**

**ముంబై,జూన్ 25, (రిపబ్లిక్ న్యూస్):**



మహారాష్ట్ర రాజకీయాల్లో యూనిఫామ్ సివిల్ కోడ్, ట్రిపుల్ తలాక్ అంశాలపై కొత్త వివాదం చెలరేగింది. ఎన్‌సీపీ అజిత్ పవార్ వర్గం ఎమ్మెల్యే సనా మాలిక్ అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. అలాగే ఆమె వ్యాఖ్యలపై తీవ్ర నిరసనలు కూడా వస్తున్నాయి. మహారాష్ట్ర అసెంబ్లీలో ఎమ్మెల్యే సానా మాలిక్ చేసిన ప్రకటన కలకలం రేపింది. భారత్ లో ఖురాన్ ఆధారిత చట్టాలను అమలు చేయాలని, ట్రిపుల్ తలాక్‌ను సమర్థించాలని మాలిక్ డిమాండ్ చేశారు. పాకిస్తాన్, ఖురాన్, ముస్లిం వ్యక్తిగత చట్టాలను ఉటంకిస్తూ, భారతదేశంలో ఇస్లామిక్ చట్టాన్ని అమలు చేయాలని ఎన్‌సీపీ ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. పాకిస్తాన్ లాగే, భారత్ కూడా ఇస్లామిక్ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామని ఆమె తెలిపారు. ట్రిపుల్ తలాక్‌ను సమర్థిస్తూ సనా మాలిక్.. విడాకులలో వివిధ రూపాలు ఉన్నాయి. తలాక్–ఎ–హసన్, తలాక్–ఎ–అహ్సన్, తలాక్–ఎ–బిద్దత్ అనే మూడు రకాల విడాకులు ఉన్నాయి. ట్రిపుల్ తలాక్‌కు సంబంధించి ఆమోదించిన చట్టం, అప్పటికే ఆచరణలో విస్తృతంగా అమలులో లేని ఒక వ్యవస్థపై ఆధారపడి ఉంది. దాని ప్రస్తావన ఎక్కడా లేదు. ఆ తర్వాత బహుభార్యత్వం గురించి మాట్లాడుతూ, బహుభార్యత్వం కేవలం ఒక మతంలోనే కాకుండా, ప్రతి మతంలోనూ ప్రబలంగా ఉంది. ముస్లింలలో బహుభార్యత్వం గురించి బోధిస్తారు. దానిని పాటించాలి. దీని కోసం ఒక చట్టాన్ని రూపొందించాలని అన్నారు. తన వ్యాఖ్యలకు సంబంధించి సనా మాలిక్ సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో ఒక వీడియోను పంచుకున్నారు. ట్రిపుల్ తలాక్ చట్టం అమలుపై అసెంబ్లీలో తన అభిప్రాయాన్ని వెల్లడించానని, రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా అన్ని మతాలకు సమానంగా వర్తించే చట్టాలు ఉండాలని తాను భావిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే, ఈ అంశంపై జరిగిన చర్చలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి యోగేష్ కదమ్ స్పందించారని, చట్టాలు అమల్లోకి వచ్చిన తర్వాత అవి అన్ని మతాలకు వర్తిస్తాయని ఆయన చెప్పినట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా, ఈ వ్యాఖ్యలపై బీజేపీ నాయకులు సనా మాలిక్ పై విమర్శలు గుప్పించారు. మహారాష్ట్ర ప్రభుత్వ మంత్రి, బీజేపీ ఎమ్మెల్యే నితేష్ రాణెలి మాట్లాడుతూ, ట్రిపుల్ తలాక్ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఒక నిర్ణయం తీసుకున్నప్పటికీ, అసెంబ్లీలోని కొందరు ఖురాన్, ముస్లిం గ్రంథాలను ఉటంకిస్తూ యూనిఫామ్ సివిల్ కోడ్ (యూసీసీ)ని ఇప్పటికీ వ్యతిరేకిస్తున్నారని అన్నారు. యూసీసీ గురించి రాజ్యాంగంలో ప్రస్తావించారు, కానీ కొందరు తమ చట్టవిరుద్ధ చర్యలను సమర్థించుకోవలసి వచ్చినప్పుడు మాత్రమే దానిని ప్రస్తావిస్తారు. ఎవరైనా దేశ చట్టాలను, రాజ్యాంగాన్ని పాటించకూడదనుకుంటే, వారు తమ పదవికి రాజీనామా చేసి పాకిస్తాన్‌కు వెళ్ళిపోవాలి అని సూచించారు.

# నల్లగొండలో నలుగురి అనుమానాస్పద మృతి కేసు

**పోలీసుల అదుపులో ఆరుగురు సుపారీ హంతకులు ?**



**నల్గొండ,జూన్ 25, (రిపబ్లిక్ న్యూస్):** జిల్లా కేంద్రంలోని తెలంగాణ కాలనీలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురి అనుమానాస్పద మృతి కేసు కీలక మలుపు తిరిగింది. భార్యాభర్తలు మహ్మద్ సుల్తాన్(45), హసీనా(38), కుమారుడు ముజామిల్(20), కూతురు అఫోర(14)ను నిందితులు విచక్షణారహితంగా హత్య చేసినట్టు పోలీసులు గుర్తించారు. సుపారీ గ్యాంగ్‌లోని ఆరుగురు సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకొని రహస్య ప్రాంతంలో విచారిస్తున్నట్టు సమాచారం. కుటుంబ గొడవలు, ఆస్తి తగాదాలే హత్యలకు కారణంగా భావిస్తున్నారు. ఈనెల 22న హత్యలు జరగ్గా.. ఘటనాస్థలిలో ఏ ఒక్క ఆధారం లభ్యం కాకపోయినప్పటికీ పోలీసులు తీవ్రంగా శ్రమించి .. సుపారీ గ్యాంగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. పదునైన ఆయుధంతో దాడిచేసి హత్య చేసినట్లు ఫోరెన్సిక్ నివేదికలో తేలిందని పోలీసులు తెలిపారు. నగరంలోని ప్రకాశం బజార్‌లో సుల్తాన్ బ్యాగులు విక్రయించే వ్యాపారం చేస్తున్నారు. దంపతుల మధ్య కొన్ని రోజుల నుంచి గొడవలు జరుగుతున్నాయి. మద్యం తాగి తరచూ ఇంటికి వచ్చి సుల్తాన్ గొడవ పెట్టుకునేవారని స్థానికులు చెబుతున్నారు. వీరి కుమారుడు ముజామిల్ ఏసీ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నారు. హసీనా ఓ ప్రైవేటుపాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. కుమార్తె అఫోర ఇదే పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. సుల్తాన్ మొదటి భార్య మృతిచెందింది. హసీనాతో రెండో వివాహం కాగా ఇప్పుడున్న పిల్లలిద్దరూ సుల్తాన్ మొదటి భార్య పిల్లలని స్థానికులు చెబుతున్నారు.

# ఈపీఎఫ్ఓ సేవలు 4 రోజులు బంద్!

**జూన్ 26 నుంచి 29 వరకు ఈపీఎఫ్‌వో ఆన్‌లైన్ సేవలు నిలిపివేత**

**జూన్ 30 నుంచి సేవలు పునరుద్ధరణకు అవకాశం**

**న్యూఢిల్లీ,జూన్ 25, (రిపబ్లిక్ న్యూస్):**




దేశవ్యాప్తంగా కోట్లాది ఉద్యోగులు వినియోగించే ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) ఆన్‌లైన్ సేవలు కొన్ని రోజుల పాటు అందుబాటులో ఉండవు. సిస్టమ్ అప్‌గ్రేడ్, డేటా మైగ్రేషన్ పనుల కారణంగా సభ్యుల పోర్టల్, యజమానుల పోర్టల్, ఉమంగ్ యాప్‌లోని పలు కీలక సేవలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఈపీఎఫ్‌వో ప్రకటించింది.
జూన్ 26 నుంచి 29 వరకు ఈ సేవలు నిలిచిపోనున్నాయి. ఈ కాలంలో పీఎఫ్ క్లెయిమ్‌లు దాఖలు చేయడం, క్లెయిమ్ ప్రాసెసింగ్, ఈ–పాస్‌బుక్ వీక్షించడం, కొత్త ఉద్యోగుల యూఏఎన్ లింకింగ్, ఈసీఆర్ ఫైలింగ్ వంటి సేవలు అందుబాటులో ఉండవు. సాంకేతిక మార్పుల ద్వారా మరింత వేగవంతమైన, సురక్షితమైన సేవలు అందించడమే దీని ఉద్దేశమని ఈపీఎఫ్‌వో తెలిపింది.సేవలు జూన్ 30 నుంచి తిరిగి ప్రారంభమయ్యే అవకాశం ఉందని వెల్లడించింది. అయితే ఉమంగ్ యాప్‌లో కనిపిస్తున్న సమాచారం ప్రకారం కొన్ని సేవలు జులై 2 వరకు అందుబాటులోకి వచ్చే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో సభ్యులు, యజమానులు తమ అవసరాలను ముందుగానే పూర్తి చేసుకోవాలని సూచించింది. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే ఈపీఎఫ్‌వో హెల్ప్‌లైన్ 14470ను సంప్రదించాలని సంస్థ సూచించింది.

# ఓజి -2 సీక్వెల్‌కు పవన్ రెడీ

## సోషల్ మీడియాలో స్పెషల్ వీడియో విడుదల

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా, యంగ్ డైరెక్టర్ సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కిన గ్యాంగ్‌స్టర్ డ్రామా 'ఓజీ' బాక్సాఫీస్ దగ్గర సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. అయితే ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'ఓజీ 2' రానున్న విషయం ఇప్పటికే అధికారికంగా ప్రకటించగా, తాజాగా ఆ సినిమా పనులు అధికారికంగా ప్రారంభమయ్యాయి. ఈ విషయాన్ని తెలుపుతూ చిత్రబృందం గురువారం ఒక స్పెషల్ వీడియోను సోషల్ మీడియా వేదికగా విడుదల చేసింది. ఈ వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. 'గంభీర కథ సిద్ధమవుతోంది. తుపాను రావడానికి ముందు నిశ్శబ్దం ఉంటుంది' అనే పవర్‌ఫుల్ క్యాప్షన్‌తో ఈ అప్‌డేట్ ఇచ్చారు. విడుదలైన వీడియోలో డైరెక్టర్ సుజీత్‌తో కలిసి పవన్ కళ్యాణ్ స్క్రిప్ట్ గురించి చర్చిస్తున్న విజువల్స్ ఉన్నాయి. చివర్లో పవన్ కళ్యాణ్ 'నేను రెడీ' అని చెప్పడం నెటిజన్లను, మెగా అభిమానులను విపరీతంగా ఆకర్షిస్తోంది. దీంతో 'ఓజీ 2' షూటింగ్ త్వరలోనే సెట్స్ మీదకు వెళ్లనుందని




స్పష్టమవుతోంది. మొదటి భాగానికి సంగీత దర్శకుడిగా పని చేసిన థమన్ ఎస్ ఈ సీక్వెల్‌కు కూడా మ్యూజిక్ అందించనున్నారు. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై డీవీవీ దానయ్య నిర్మిస్తున్న ఈ భారీ చిత్రంపై అంచనాలు ఇప్పటికే పీక్స్‌లో ఉన్నాయి. 'ఓజీ' మొదటి భాగంలో చూపించిన పవర్‌ఫుల్ గ్యాంగ్‌స్టర్ వరల్డ్‌ను ఈ సీక్వెల్‌లో మరింత పెద్ద స్థాయిలో, కొత్త కోణంలో చూపించనున్నారని టాక్. ప్రస్తుతం రాజకీయాలతో బిజీగా ఉన్న పవన్ కళ్యాణ్, 'ఓజీ 2' కోసం డేట్స్ కేటాయించడంతో అభిమానుల్లో ఫుల్ జోష్ నెలకొంది.



# మామ సినిమాకు అల్లుడు క్లాప్

## బాలకృష్ణ 112వ చిత్రానికి లోకేశ్ కెమెరా ఆన్

రాజధాని అమరావతిలో నందమూరి నటసింహం బాలకృష్ణ 112వ చిత్రం గ్రాండ్‌గా లాంచ్ అయ్యింది. సినిమా ప్రారంభోత్సవ వేడుకలకు మంత్రులు నారా లోకేశ్, కందుల దుర్గేష్ ముఖ్య అతిథులుగా హాజరై.. క్లాప్ కొట్టి, కెమెరా స్విచ్ఆన్ చేశారు. ఈ సందర్భంగా హీరో బాలకృష్ణ మాట్లాడుతూ.. సినిమా ఓపెనింగ్ కోసం వచ్చిన మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సినిమా మొదటి షాట్‌ను డైరెక్ట్ చేసిన నందమూరి తేజస్వినికి ధన్యవాదాలు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్‌లో పెద్ద సినిమాకి క్లాప్ కొట్టి 20 సంవత్సరాలు అయ్యిందన్నారు. ఏపీలో సినీ పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కృషి చేస్తున్నారని అన్నారు. పర్యాటక రంగం, సినీ పరిశ్రమ రెండూ ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయని బాలయ్య తెలిపారు. సినీ ఇండస్ట్రీని ప్రోత్సహించే ప్రయత్నం చేస్తున్నామని మంత్రి లోకేశ్ తెలిపారు. సినిమాతో పాటు థియేటర్ ఎకనామిని ప్రోత్సహిస్తామన్నారు. ఎఐ టెక్నాలజీతో సినిమా పరిశ్రమను మరింత ఉన్నతికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సినిమాలు అమరావతి నుంచే ప్రారంభం కావాలని కోరుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. సినీ పరిశ్రమకు సంపూర్ణ సహకారం అందిస్తామని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. స్టూడియోలు, రికార్డింగ్ థియేటర్లకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు.

# సందీప్ కిషన్ సూపర్ సుబ్బు

టాలీవుడ్ యంగ్ హీరో సందీప్ కిషన్ ప్రధాన పాత్రలో నటించిన సరికొత్త వెబ్ సిరీస్ 'సూపర్ సుబ్బు'. నెట్‌ఫ్లిక్స్ సంస్థ అందిస్తున్న మొట్టమొదటి ఒరిజినల్ తెలుగు సిరీస్ ఇదే కావడం విశేషం. తాజాగా ఈ సిరీస్ అఫీషియల్ ట్రైలర్‌ను




నెట్‌ఫ్లిక్స్ ఇండియా విడుదల చేసింది. 'డీజే టిల్లు' ఫేమ్ డైరెక్టర్ మల్లిక్ రామ్ ఈ కామెడీ డ్రామా సిరీస్‌ను తెరకెక్కించారు. బాలీవుడ్ 'లిటిల్ థింగ్స్' ఫేమ్ మిథిలా పాల్కర్ ఈ సిరీస్‌లో హీరోయిన్‌గా నటిస్తోంది. ఒక అమాయక యువకుడు, అత్యంత సంప్రదాయ గ్రామం, అసాధ్యమైన ఓ ఉద్యోగం అనే ఆసక్తికరమైన క్యాప్షన్‌తో ఈ సిరీస్ వస్తోంది. సుబ్రమణ్యం చిలుకూరి రావు అలియాస్ సుబ్బు అనే ఒక అమాయక ఫ్లలెటూరి యువకుడికి ఎవరూ వెళ్లడానికి ఇష్టపడని 'మాకీపూర్' అనే వింత ఊరికి పోస్టింగ్ వస్తుంది. తన తండ్రి కుకటేశ్వరరావు ముందు పరువు నిలబెట్టుకోవాలని ఆ ఊరిలో అడుగుపెట్టిన సుబ్బుకి అక్కడ ఊహించని షాక్ తగులుతుంది. దేశంలోనే అత్యధిక సంతానోత్పత్తి రేటు ఉండి, జనాభా నియంత్రణ లేని ఆ ఊరి జనాలకి మనోడు సెక్స్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా పాఠాలు చెప్పాల్సి వస్తుంది. ఒకవైపు జాబ్ టెన్షన్స్, లవ్ ప్రాబ్లమ్స్, ఇంకోవైపు ఊరి జనాల అపార్థాల మధ్య సుబ్బు పడే ఇబ్బందులు, క్రియేట్ చేసే కామెడీతో ఈ ట్రైలర్ నవ్వులు పూయించింది. మిథిలా పాల్కర్ ఒక క్రేజీ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా, నటి అవ్వాలని కలలుకనే పాత్రలో కనిపించనుంది. వీరితో పాటు కామెడీ కింగ్ బ్రహ్మానందం, వర్సటైల్ యాక్టర్ మురళీ శర్మ, గెటప్ శ్రీను, జీవన్, మానస చౌదరి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. చిలకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజీవ్ చిలక, భరత్ లక్ష్మీపతి ఈ సిరీస్‌ను నిర్మించారు. మల్లిక్ రామ్, రమేష్ ఎలిగేటి, శివాని ధోబాల్ సంయుక్తంగా దీనికి కథను అందించారు. ఈ అవుట్ అండ్ అవుట్ హిలేరియస్ ఎంటర్‌టైనర్ వెబ్ సిరీస్ జులై 2 నుంచి నెట్‌ఫ్లిక్స్ ఓటీటీ వేదికగా తెలుగుతో పాటు తమిళం, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో స్ట్రీమింగ్ కానుంది.

# ప్రొడ్యూసర్ కి 15 కండిషన్స్ పెట్టిన యంగ్ బ్యూటీ..

టాలెంటెడ్ యాక్టర్ ప్రియదర్శి హీరోగా, సోషల్ మీడియా ఫోక్ సెన్సేషన్ నాగదుర్గ హీరోయిన్‌గా నటిస్తున్న సరికొత్త చిత్రం గ్రాండ్‌గా లాంచ్ అయింది. ఈ సినిమాకు 'ఇడుపు కాయితం' అనే ఇంట్రెస్టింగ్ టైటిల్‌ను ఫిక్స్ చేశారు. సుకుమార్ రైటింగ్స్, బన్నీ వాస్ వర్క్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ మూవీ పూజా కార్యక్రమానికి స్టార్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ గెస్ట్‌గా వచ్చి టైటిల్ పోస్టర్‌ను లాంచ్ చేశారు. అయితే, ఈ ఈవెంట్‌లో ప్రొడ్యూసర్ బన్నీ వాస్ తన హీరోయిన్ నాగదుర్గ గురించి చెప్పిన ఒక ఇంట్రెస్టింగ్ మ్యాటర్ ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. సినిమా ఓపెనింగ్స్ వేడుకలో నిర్మాత బన్నీ వాసు మాట్లాడుతూ హీరోయిన్ నాగదుర్గ గురించి ఒక క్రేజీ సీక్రెట్ బయటపెట్టారు. "ఈ సినిమాలో హీరోయిన్‌గా చేయాలని నాగదుర్గను సంప్రదించగానే, ఆమె ఓకే చెప్పడానికి ముందు నాకు ఏకంగా 15 కండిషన్స్ పెట్టింది. ఇక ఆ రూల్స్ అన్నీ విన్నాక నేనేం అప్సెట్ అవ్వలేదు, పైగా చాలా ఆనందించాను. ఒక తెలుగు అమ్మాయి తన కెరీర్ విషయంలో, చేసే క్యారెక్టర్ విషయంలో ఎంత క్లారిటీగా ఉందో చూసి నాకు ముచ్చటేసింది. అప్పుడే నాకు అర్థమైంది.. నేను మాట్లాడుతోంది పక్కా క్లారిటీ ఉన్న ఒక తెలుగు అమ్మాయితో అని" అంటూ బన్నీ వాస్ సర్ప్రైజ్ అయ్యారు. యూట్యూబ్, సోషల్ మీడియాలో తెలంగాణ జానపద పాటలు, ప్రైవేట్ ఆల్బమ్స్ ద్వారా నాగదుర్గకు ఎంత క్రేజ్ ఉందో అందరికీ తెలిసిందే. ఆమె చేసిన ప్రతి ఫోక్ సాంగ్ మిలియన్ల కొద్దీ వ్యూస్ రాబట్టి రికార్డులు సృష్టించింది. ఇక డాన్స్‌లో ఇప్పటికే డిజిటల్ ప్లాట్‌ఫారమ్స్‌ను షేక్ చేసిన నాగదుర్గ, ఇప్పుడు 'ఇడుపు కాయితం' సినిమాతో సిల్వర్ స్క్రీన్ మీద కూడా దూసుకుపోవాలని రెడీ అవుతోంది.





# కలెక్షన్లు రాబడుతున్న మా ఇంటి బంగారం

## ఆరు రోజుల్లో రూ.55.71 కోట్ల గ్రాస్ వసూళ్లు

స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'మా ఇంటి బంగారం' బాక్సాఫీస్ దగ్గర మంచి ప్రదర్శన కనబరుస్తుంది. విడుదలైన తొలి వారంలోనే ఈ చిత్రం అద్భుతమైన వసూళ్లను నమోదు చేస్తూ సమంత కెరీర్‌లోనే అత్యుత్తమ ఓపెనింగ్స్ సాధించిన సినిమాల్లో ఒకటిగా నిలిచింది. యాక్షన్, ఫ్యామిలీ ఎమోషన్స్, థ్రిల్లింగ్ అంశాల కలయికతో రూపొందిన ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటూ బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, 'మా ఇంటి బంగారం' చిత్రం ప్రపంచవ్యాప్తంగా ఆరు రోజుల్లో రూ.55.71 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించింది. భారతదేశంలో రూ.33.20 కోట్ల నెట్ కలెక్షన్లు నమోదు చేయగా, దేశీయ గ్రాస్ వసూళ్లు రూ.38.36 కోట్లకు చేరుకున్నాయి. విడుదలైన ఆరో రోజున కూడా సినిమా మంచి వసూళ్లు సాధించడంతో బాక్సాఫీస్ వద్ద ఈ చిత్ర జోరు కొనసాగుతోంది. విదేశీ మార్కెట్లలో కూడా ఈ సినిమాకు మంచి ఆదరణ లభిస్తోంది. ఇప్పటివరకు ఓవర్సీస్‌లో ఈ చిత్రం రూ.17.35 కోట్ల గ్రాస్ కలెక్షన్లు నమోదు చేసినట్లు ట్రేడ్ రిపోర్టులు సూచిస్తున్నాయి. ఆరో రోజున ఒక్క రోజులోనే విదేశీ మార్కెట్ల నుంచి రూ.కోటికి పైగా వసూళ్లు రావడం విశేషం. ముఖ్యంగా అమెరికా, ఆస్ట్రేలియా, యూకే మార్కెట్లలో సినిమాకు మంచి స్పందన లభిస్తున్నట్లు తెలుస్తోంది. చాలా కాలం తర్వాత సమంత ప్రధాన పాత్రలో వచ్చిన ఈ సినిమా యాక్షన్, ఫ్యామిలీ, థ్రిల్లర్ అంశాలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. సినిమాలో దిగంత్, గుల్షన్ దేవయ్య, గౌతమి, శ్రీముఖి, శ్రీలక్ష్మి, శ్రీనివాస్ గవిరెడ్డి, మంజుషా తదితరులు కీలక పాత్రల్లో నటించారు.




# వెండితెరపైకి వస్తోన్న మిర్జాపూర్

అత్యంత ప్రజాదరణ పొందిన క్రైమ్ డ్రామా వెబ్ సిరీస్ 'మిర్జాపూర్' ఇప్పుడు వెండితెరపై అలరించడానికి సిద్ధమైంది. అమెజాన్ ప్రైమ్ వీడియోలో మూడు సీజన్ల పాటు ఓటీటీ ప్రేక్షకులను అలరించిన ఈ సిరీస్, ఇప్పుడు 'మిర్జాపూర్: ది మూవీ' పేరుతో భారీ ఫీచర్ ఫిల్మ్‌గా రాబోతోంది. ఈ సందర్భంగా మేకర్స్ సినిమాకు సంబంధించిన అధికారిక టీజర్‌ను విడుదల చేశారు. ఈ టీజర్‌లో పంకజ్ త్రిపాఠి కాలీన్ భయ్యాగా, అలీ ఫజల్ గుడ్డూ భయ్యాగా, దివ్యేందు మున్నా భయ్యాగా తమ ఐకానిక్ పాత్రల్లో మళ్లీ కనిపించి అభిమానులను అలరించారు. మరోవైపు ఈ చిత్రంలో రవి కిషన్, పంచాయత్ ఫేమ్ జితేంద్ర కుమార్ కీలక పాత్రల్లో ఎంట్రీ ఇస్తూ మరింత ఆసక్తిని పెంచుతున్నారు. రెండు నిమిషాల కంటే ఎక్కువ నిడివి ఉన్న ఈ టీజర్ పాత జ్ఞాపకాలను గుర్తు చేస్తూ, మరింత భారీ యాక్షన్ మరియు పవర్‌ఫుల్ డైలాగ్స్‌తో సాగింది. ఈ సారి కేవలం మిర్జాపూర్ గద్దె కోసమే కాకుండా అధికారం కోసం కూడా యుద్ధం జరగబోతోందని టీజర్‌తో స్పష్టమవుతుంది. ఈ చిత్రం సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. కేవలం హిందీలోనే కాకుండా ఇతర భాషలో కూడా థియేటర్లలో విడుదలరాబోతున్నట్లు తెలుస్తుంది.

# నా బాడీ నాష్టం అంటే..వాడి కళ్లు వాడి ఇష్టం

## స్త్రీల వేషధారణపై పరిమితులు ఉండాలన్న సునీత




ప్రముఖ ప్లేబ్యాక్ సింగర్ సునీత ఇటీవల ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో మహిళల వస్త్రధారణ, సినిమా సామాజిక బాధ్యత, మరియు సమాజంలో స్వేచ్ఛ అనే అంశాలపై చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చకు దారితీశాయి. సమాజంలో జరిగే విషయాలనే సినిమాలో చూపిస్తున్నామని మేకర్స్ చెప్పే సమాధానాన్ని సునీత తప్పుబట్టారు. కమర్షియల్ సినిమా అయినా, ఎలాంటి సినిమా అయినా సమాజం పట్ల కొంత బాధ్యత కలిగి ఉండాలని ఆమె అభిప్రాయపడ్డారు. అయితే సమాజంలో సినిమాని తిడితే, సినిమాలో సమాజాన్ని తిడుతున్నారు, సమాజం అలా ఉంది కాబట్టే తాము ఇలా సినిమా తీశామని మేకర్స్ చెబుతున్నారని సునీత పేర్కొన్నారు. ఇక ఇటీవల కాలంలో బాగా వినిపిస్తున్న మై బాడీ మై రైట్ అనే స్లోగన్‌పై సునీత ప్రాక్టికల్ కోణంలో మాట్లాడారు. అమ్మాయిలు నా బాడీ నా ఇష్టం అని తమకు నచ్చిన బట్టలు వేసుకున్నప్పుడు, అవతలి వ్యక్తి చూసే చూపును కూడా వాడి కళ్ళు వాడి ఇష్టం అనాల్సి వస్తుందని, ఇందులో ఎవరినీ తప్పు పట్టలేమని అన్నారు. ఎవరి ఇష్టం వారిదని ఆమె స్పష్టం చేశారు. అయితే బట్టల పరిధిని పెంచుకోవడాన్ని లేదా తగ్గించుకోవడాన్ని తన దృష్టిలో అసలైన స్వేచ్ఛ అనరని సునీత తెలిపారు. చుట్టూ ఉన్న పరిసరాలు ఎంతవరకు సురక్షితంగా ఉన్నాయో చూసుకోవడం కూడా ముఖ్యమని పేర్కొన్నారు. కేవలం బట్టలు లేదా సిగరెట్లు తాగడం ఈక్వాలిటీ కాదని, సమాజంలో లేదా ఒక ఇంట్లో ఒక మహిళ తన అభిప్రాయాన్ని చెప్తే, దానికి పురుషులు ఎంతవరకు విలువ ఇస్తున్నారు అనే దానిపై పోరాడాలని సునీత అభిప్రాయపడ్డారు. పెద్ది సినిమాలో జాన్వీ కపూర్ పాత్ర చిత్రీకరణపై కూడా సునీత పరోక్షంగా ప్రస్తావిస్తూ ఎవరి ఒపీనియన్ వాళ్లది. ఎస్ చెప్పాలన్నా, నో చెప్పాలన్నా మన ఇష్టమే. కేవలం సినిమా ఇండస్ట్రీలోనే కాదు, నేను జనరల్ గా సొసైటీలో ఉన్న అమ్మాయిల గురించి కూడా మాట్లాడుతున్నాను. ఇక్కడ ఒక గీత గీయాలంటే, ఫుల్ స్టాప్ పెట్టాలంటే బలవంతం ఏమీ లేదు అని సునీత తెలిపారు.

-------------

ప్రజా రిపబ్లిక్



# నంద్యాల జిల్లా పోలీసు అడ్మినిస్ట్రేషన్ సిబ్బందితో సమీక్షాసమావేశం నిర్వహణ

**పెండింగ్ వర్క్స్ లేకుండా నిబద్ధతతో విధులు నిర్వహించండి**

**పోలీసు అధికారులకు సిబ్బందికి రావసిన బెన్ఫిట్స్ వివరాలపై ఆరా**

**సకాలంలో పోలీసు వారి వృతి పరమైన ఫిర్యాదులు పరిష్కరించండి**




**నంద్యాల క్రైం, జూన్ 25, (రిపబ్లిక్ న్యూస్):** ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాలమేరకు గురువారం నంద్యాల జిల్లా పోలీసు పరిపాలన విభాగ సిబ్బందితో జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ యుగంధర్ బాబు సమీక్షాసమావేశం నిర్వహించడం జరిగింది. జిల్లా పరిపాలన కార్యాలయంలోని వివిధ విభాగాలు అనగా అడ్మినిస్ట్రేషన్ సెక్షన్ ,బడ్జెట్ సెక్షన్, పే సెక్షన్ ,జెనరల్ సెక్షన్,ఇన్ వర్డ్ ,ఔట్ వర్డ్ ,స్టోర్ మొదలగు అన్నీ విభాగాల సిబ్బందితో మాట్లాడి ఆఫీసుకు సంబందించిన రికార్డులు సరిగా ఉన్నాయా లేదా అని అడిగి తెలుసుకొని పై అన్నీ విభగాలపై పెండింగ్ వర్క్స్ పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ సిబ్బందికి అందవలసిన అన్నీ బెన్ఫిట్స్ సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అడ్మినిస్ట్రేషన్ అధికారులను ఆదేశించారు. అనంతరం పోలీస్ సిబ్బంది యొక్క మెడికల్ బిల్లులకు సంబంధించిన వివరాలు తెలుసుకొని పెండింగ్ బిల్లులను త్వరగా క్లియర్ చేసి సిబ్బందికి టైం కు అందించాలని ,ఆఫీసు నందు పెండింగ్ ఉండకుండా చూసుకోవాలని ఆదేశించారు. పోలీసు సిబ్బంది యొక్క ఏపీజిఎల్ఐ, జీపీఎఫ్ భద్రత పర్సనల్ లోన్ లకు సంబందించి అప్లై చేసుకున్నవారికి సకాలంలో లోన్ అందించే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలీసు సీనియారిటీకి సంబండిచిన రికార్డులను, వారి ప్రమోషన్ కు సంబందించిన రికార్డులను ఎలాంటి అవకతవకకు తావులేకుండా జాగ్రతగా ప్రభుత్వ నిబందనల ప్రకారం ప్రమోషన్ వచ్చేలా రికార్డులు ఉంచుకోవాలని ఆదేశించారు. సిబ్బందికి




అందవలసిన ఇంక్రిమెంట్ ,మిస్సింగ్ క్రెడిట్స్ టీఏలు ,శాలరీ పెండింగ్ మొదలగునవి పెండింగ్ లో లేకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పరిపాలన విభాగ అధికారులు వీరన్నగారు ,ఖాదర్ వలి, కవిత, సురేష్ అడిషనల్ క్యాంప్ క్లార్క్ రాఘువేంద్ర, వివిధ విభాగాలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

# కర్నూలు జిల్లాలో పాఠశాల మౌలిక వసతుల అభివృద్ధికి వేగం

**మిగులు నిధులతో పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశం**

**మోడల్ ప్రైమరీ పాఠశాలలకు అన్ని సౌకర్యాలు కల్పించాలి**

**మరుగుదొడ్లు, తాగునీటి వసతులకు తొలి ప్రాధాన్యం**

**నెలాఖరులోగా పనుల పూర్తి కోసం కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి**




**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 25)**
ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఇన్ఫ్రా ప్రాజెక్ట్ డైరెక్టర్ మువ్వా రామలింగం కర్నూలు జిల్లాలోని విద్యా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సునయన ఆడిటోరియంలో జరిగిన ఈ సమావేశంలో ఎంఈఓ-1,ఎంఈఓ-2లు, క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు, మిగులు నిధులు అధికంగా ఉన్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మనబడి-మన భవిష్యత్తు కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న ఇంజనీరింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రామలింగం మాట్లాడుతూ జిల్లాలో సుమారు 760 మోడల్ ప్రైమరీ పాఠశాలలు ఉన్నాయని, వాటికి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. మనబడి-మన భవిష్యత్తు రెండో దశలో నిలిచిపోయిన పనులను వెంటనే పునఃప్రారంభించి, కేటాయించిన మిగులు నిధులను సద్వినియోగం చేయాలని ఆదేశించారు.

పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన అనంతరం కూడా నిధులు మిగిలితే, అవసరం ఉన్న ఇతర పాఠశాలలకు బదిలీ విధానం ద్వారా కేటాయించాలని సూచించారు. నిధుల వినియోగంలో మేజర్, మైనర్ మరమ్మత్తులు, మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీటి వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని, అనంతరం పెండింగ్‌లో ఉన్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు చేపట్టాలని పేర్కొన్నారు.

పాఠశాలల్లో పనులు పూర్తయిన తర్వాత ప్రధానోపాధ్యాయులు ఎస్టిఎమ్ఎస్ యాప్‌లో బిల్లులను అప్‌లోడ్ చేయాలని సూచించారు. మోడల్ ప్రైమరీ పాఠశాలల కోసం లీడ్ స్టేట్‌మెంట్‌లు, ఇన్‌పుట్ డేటా షీట్లు, అంచనాల తయారీని ఇంజనీరింగ్ అధికారులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

జిల్లాలో ఆర్వో ప్లాంట్లు ఉన్న పాఠశాలల్లో షెడ్యూల్ ప్రకారం మరమ్మత్తులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు టెక్నీషియన్ల సహకారంతో ఆర్వో ప్లాంట్లను నిరంతరం పనిచేసేలా చూడాలని సూచించారు. అలాగే డెస్కులు, ఫ్యాన్లు, గ్రీన్ బోర్డులు, ఆర్వో ప్లాంట్లు, ఇంటరాక్టివ్ ప్యానెల్లు, టీవీలు వంటి సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ మెటీరియల్స్ అవసరం ఉన్న పాఠశాలలకు బదిలీ చేసుకోవాలని పేర్కొన్నారు.



ఈ నెలాఖరులోగా అన్ని పనులు పూర్తి చేయడానికి ఎంఈఓ లు, ప్రధానోపాధ్యాయులు పరస్పర సమన్వయంతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల మౌలిక వసతుల అభివృద్ధికి అవసరమైన నిధులు అందించేందుకు సిద్ధంగా ఉందని, ప్రతి నియోజకవర్గంలో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కూడిన ఒక ఆదర్శ పాఠశాలను అభివృద్ధి చేయడమే లక్ష్యమని తెలిపారు.

ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్. సుధాకర్, సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ ఎన్.బి. లోకరాజు, ఇంజనీరింగ్ అధికారులు, సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబు సభస్టలిని పరిశీలిస్తున్న. కూడా చైర్మన్ ముక్కారూపానంద రెడ్డి.



**రైల్వే కోడూరు జూన్ 25 రిపబ్లిక్ న్యూస్.**
ఓబులవారిపల్లి మండలం ముక్కు వారి పల్లి గురుకుల పాఠశాల ఎదురుగా ఆర్ఆర్ 5 మంగంపేట పునరావాసం గ్రామం పక్కన స్థలాన్ని జూలై నెల రెండవ తేదీ సీఎం చంద్రబాబు నాయుడు విచ్చేయు సందర్భంగా సభస్టలి ప్రాంగణాన్ని కూడా చైర్మన్ రైల్వేకోడూరు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి ముక్కారూపానందరెడ్డి, రైల్వే కోడూరు జనసేన పార్టీ శాసనసభ్యులు ఎమ్మెల్యే ఆర్వ శ్రీధర్, రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు,ఆర్డీవో రామ్మోహన్ రావు తదితర జిల్లా యంత్రాంగం సభా ప్రాంగణ స్థలాన్ని పరిశీలించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్కింగ్,సభ జరుగు స్టేజ్,వాహనాలు పార్కింగ్,తదితర మ్యాపులను పరిశీలించారు,ఎక్కడ ప్రజలకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎటువంటి ఇబ్బందులు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజల అవసరాలకు, ఏర్పాటుకు ఎటువంటి అసౌకర్యానికి లోను కాకుండా ప్రజలు ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు అత్యంత సుందరంగా సభా ప్రాంగణాన్ని తయారుచేసి చూపరలను అబ్బురపరిచే విధంగా 24 గంటలు లోపు యువ నాయకులు ముక్కా సాయి వికాస్ రెడ్డి సారధ్యంలో సభ స్థల ప్రాంగణాన్ని అత్యంత వైభవంగా సుందరంగా తీర్చిదిద్దడం జరుగుతోందని పలువురు కూటమి నాయకుల అభిప్రాయం వ్యక్తం చేశారు ఏది చేయాలన్న ఇటువంటి కార్యక్రమాలు జరపడంలో ముక్కా కుటుంబీకులు ఎంతో చాకచక్యంగా వ్యవహరిస్తూ అనుకున్న పనులు వేగవంతం చేయడంలోను యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి జిల్లా యంత్రాంగం దృష్టిలో శభాష్ అనిపించుకున్నారని పలువురు నాయకులు కార్యకర్తలు ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు ఈ కార్యక్రమంలో కూడా చైర్మన్ టిడిపి ఇన్చార్జ్ ముక్కారూపానంద రెడ్డి సతీమణి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకురాలు ముక్కా వరలక్ష్మి. ఓబులవారిపల్లి మండల తాసిల్దార్ ఆకుల సిద్దేశ్వర రావు,



మండల రెవెన్యూ అధికారి మల్లికార్జున రెడ్డి,రూరల్ సీఐ శ్రీనివాసులు ఓబులవారిపల్లి సబ్ ఇన్స్పెక్టర్ సుజన్ కుమార్ విజిలెన్స్ హెడ్ కానిస్టేబుల్ రంగనాథ్. నాగేంద్ర,మండల సర్వేయర్ నాగలక్ష్మి పంచాయతీ అధికారులు, త్రివేణి కంపెనీ కార్మికులు. కూటమి నాయకులు తాతంశెట్టి నాగేంద్ర తల్లెం వెంకటరమణారెడ్డి,గుత్తి నరసింహ, యువ నాయకుడు కౌలూరి గజేందర్ నాయుడు, శివయ్య నాయుడు,కోటి నాయుడు. మంగపేట పంచాయితీ మాజీ వైస్ ప్రెసిడెంట్ బత్తిన వేణుగోపాల్ రెడ్డి,సిగమాల మల్లికార్జునరెడ్డి, గునిపాటి వేణు, కల్లా చలపతి,ఎర్ర బాబు శేఖర్ రెడ్డి, ఎర్రబాబు మధుసూదన్ రెడ్డి,తదితర కూటమి నాయకులు అధికారులు పాల్గొన్నారు.

# కర్నూలులో అశోక్ లేలాండ్ షోరూం ప్రారంభం

**మంత్రి టి.జి. భరత్ చేతుల మీదుగా ఘన ప్రారంభోత్సవం**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 25)**దేశవ్యాప్తంగా అశోక్ లేలాండ్ సంస్థ అత్యుత్తమ సేవలను అందిస్తూ వాణిజ్య వాహన రంగంలో ముందంజలో నిలుస్తోందని రాష్ట్ర మంత్రి టి.జి. భరత్ పేర్కొన్నారు. కర్నూలు శివారు ప్రాంతంలోని డోన్ రోడ్డు, గోశాల సమీపంలో, జాతీయ రహదారి-44పై ఏర్పాటు చేసిన అశోక్ లేలాండ్ షోరూంను మంత్రి టి.జి. భరత్ ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గౌరు వెంకటరెడ్డి, డీఎస్పీ మహబూబ్ బాషా, మైనారిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.ప్రారంభోత్సవం అనంతరం అతిథులను శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. ఈ సందర్భంగా షోరూం అధినేత వహిద్ మాట్లాడుతూ, కర్నూలు జిల్లా వ్యాప్తంగా అశోక్ లేలాండ్ వాహనాలకు 24 గంటలపాటు మరమ్మత్తు సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.వాహన యజమానులు మరియు రవాణా రంగానికి చెందిన వారు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కష్టమర్లకు నాణ్యమైన సేవలు, విడిభాగాల లభ్యత, అత్యవసర మరమ్మత్తు సదుపాయాలను అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.

## నషా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ




**నంద్యాల, జూన్ 25, (రిపబ్లిక్ న్యూస్):** అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం గురువారం సందర్భంగా, నషా ముక్త్ భారత్ అభియాన్ సప్తాహ్ కార్యక్రమాలలో భాగంగా ఎస్‌వీఆర్ ఇంజినీరింగ్ కళాశాల (స్వయంప్రతిపత్తి), అయ్యలూరు మెట్ట ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ పి. మల్లికార్జున రెడ్డి, ప్రిన్సిపాల్ డా. వై. హరి ప్రసాద్ రెడ్డి ర్యాలీని ప్రారంభించారు. విద్యార్థులు మాదకద్రవ్యాల వ్యతిరేక నినాదాలు చేస్తూ, ప్లకార్డులు ప్రదర్శిస్తూ కళాశాల నుండి అయ్యలూరు మెట్ట జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక, ఆర్థిక దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, విద్యార్థులు నషా ముక్త్ భారత్ ఉద్యమానికి రాయబారులుగా వ్యవహరించాలని సూచించారు. అదేవిధంగా, నషా ముక్త్ భారత్ అభియాన్ సప్తాహ్, అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న “నషా ముక్త్ భారత్” సంతకాల సేకరణ కార్యక్రమాన్ని కూడా కళాశాలలో కొనసాగించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు మరియు సిబ్బంది పాల్గొని మాదకద్రవ్య రహిత భారత నిర్మాణానికి తమ మద్దతును తెలియజేస్తూ సంతకాలు చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, ఎన్సీసీ క్యాడెట్లు, విద్యార్థులు, సిబ్బందితో పాటు ఈగల్ (పోలీస్) విభాగం సిబ్బంది పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించి గంజాయి ఇతర మత్తు పదార్థాలకు సంబందించిన సమాచారం ఉంటే ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1972 కి తెలియజేయాలని సూచించారు. అనంతరం మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని, సమాజంలో అవగాహన కల్పిస్తామని అందరూ ప్రతిజ్ఞ చేశారు.

### ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన

# కర్నూలు, నంద్యాల జిల్లా ఎస్పీలు

**భద్రతా చర్యలపై కర్నూలు ఎస్పీకి వివరించిన నంద్యాల జిల్లా ఎస్పీ**

**సీఎం పర్యటన భద్రతా ఏర్పాట్లపై క్షేత్రస్థాయిలో పరిశీలన**



**నంద్యాల క్రైం, జూన్ 25, (రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం మంత్రాలయం మండలం, మాధవరం గ్రామంలో పర్యటించనున్న నేపథ్యంలో చేపట్టిన భద్రతా, ఇతర ఏర్పాట్లను కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన హెలిప్యాడ్, సభా ప్రాంగణం, పార్కింగ్ ప్రాంతాలు, రూట్ బందోబస్తు, సెక్టార్‌ల వారీగా నియమించిన ఇన్‌ఛార్జ్ అధికారుల విధులు, భద్రతా చర్యలపై నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ కి సమగ్రంగా వివరించారు. బందోబస్తు విధుల్లో అప్రమత్తంగా వ్యవహరించాలని, సమన్వయంతో విధులు నిర్వహించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ పోలీసు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ శ్రీ హుస్సేన్ పీరా, నంద్యాల స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, కర్నూలు డీఎస్పీ రాఘవేంద్ర, సీఐలు, ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.




printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com